బుధవారం 22 మార్చి 2023 5 కర్నూలు





తహశీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయి, తదితరులు

సాగు చేసుకునే రైతులకు పట్టాలివ్వాలి

- రెవెన్యూ అధికారులు ఆన్‌లైన్ మోసాలు ఆపాలి
- సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయి
- తహశీల్దార్ కార్యాలయం ముందు సిపిఎం ధర్నా

ప్రజాశక్తి - దేవనకొండ

మండలవ్యాప్తంగా ప్రభుత్వ భూములు, పోరంబోకు భూములను సాగు చేసుకుంటున్న పేద, చిన్న, సన్నకారు రైతులకు వెంటనే పట్టాలివ్వాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయి డిమాండ్ చేశారు. ఇటీవల కాలంలో రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం వల్ల ఒకరి సాగులో ఉన్న పొలాన్ని మరొకరికి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారని, ఈ మోసాలను ఆపాలని తెలిపారు. మంగళవారం దేవనకొండ తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. సిపిఎం నాయకులు యూసుఫ్ బాష అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా గౌస్ దేశాయి, సిపిఎం జిల్లా నాయకులు బివీర శేఖర్ మాట్లాడారు. మండలంలో అనేకమంది పేదలు, చిన్న, సన్నకారు రైతులు పొలాల పక్కన ఉన్న భూములను సాగు చేసుకుంటున్నారని తెలిపారు. అలాగే ప్రభుత్వ భూముల్లో, అసైన్డ్ భూముల్లో కూడా 20-30 ఏళ్లుగా సాగు చేసుకుంటున్నారని, వీటికి పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ భూములే జీవనాధారంగా వందల మంది రైతులు జీవిస్తున్నారని, రెవెన్యూ అధికారుల మాత్రం వీరి పట్ల నిర్లక్ష్యంగా వహిస్తున్నారని మండిపడ్డారు. మండలంలో గత నాలుగు, ఐదేళ్లుగా ఆన్‌లైన్ మోసాలు ఎక్కువై పోయాయని తెలిపారు. ఒకరి భూమిని మరొకరి పేరుతో ఎక్కించడం, ప్రభుత్వ భూములను పెద్దలకు ఎక్కించడం పరిపాటిగా మారిందని చెప్పారు. దీని వెనుక రెవెన్యూ అధికారులు ఉంటూ పెద్ద మొత్తంలో సొమ్ము చేసుకుంటున్నారని విమర్శించారు. అన్యాక్రాంతమైన భూములను కాపాడాలని కోరారు. ఉద్యమాలు, పోరాటాలు ద్వారానే కాకుండా వారిపై క్రిమినల్ కేసులు పెట్టడానికి కూడా సిపిఎం వెనకాడదని హెచ్చరించారు. సిపిఎం మండల నాయకులు సూరి, అశోక్, మహబూబ్ బాషా, శ్రీరాములు, బజారి, వీరన్న, శ్రీనివాసులు, పెద్దయ్య, మహబూబ్ బాషా పాల్గొన్నారు.

ఉగాదికి ధరాఘాతం

- పెరిగిన ధరలతో సామాన్యుల బెంబేలు - పండగ పూట భక్ష భోజనం కష్టమే

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

ఉగాదికి సామాన్యులకు ధరాఘాతం తప్పడం లేదు. పెరిగిన ధరలతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. పండగ పూట బక్ష భోజనం కష్టంగా మారింది. చాలా మంది ఉన్న దాంట్లోనే సర్దుకుని పండగను చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది...

తెలుగు పండగల్లో తొలి పండగ తెలుగు సంవత్సరాది ఉగాది. తెలుగు రాష్ట్రాల్లో గతంలో ఈ పండగ సందడిగా ఉండేది. సామాన్యులకు ఈ ఉగాదికి ధరాఘాతం తప్పడం లేదు. ఉగాది ప్రత్యేకంగా జిల్లాలో చాలా మంది బక్షాలను చేసుకుంటారు. నిత్యావసర ధరలకు రెక్కలు రావడంతో సామాన్యులకు పండగ పూట బక్ష భోజనం కష్టంగా మారనుంది. బక్షాలకు ప్రధానంగా నూనె, బెల్లం, శనగలు, మైదాను ఉపయోగిస్తారు. లీటర్ పామాయిల్ ప్యాకెట్ రూ.120, సన్‌ఫ్లవర్ ఆయిల్ రూ.140 నుంచి రూ.170 వరకూ పలుకుతోంది. ఇతర సరుకుల ధరలు కూడా ఎక్కువగానే ఉన్నాయి. కర్నూలు నగరంలో కిలో శనగ బ్యాళ్లు రూ.80, మొదటి రకం బెల్లం రూ.80, రెండో రకం బెల్లం రూ.55గా ఉన్నాయి. ఆదోనిలో కిలో శనగ బ్యాళ్లు రూ.100 నుంచి రూ.130, బెల్లం రూ.50, మైదా రూ.40కు అమ్ముతున్నారు. నందికొట్కూరులో కిలో శనగ బ్యాళ్లు రూ.90, బెల్లం రూ.60 నుంచి రూ.70, మైదా రూ.65కు విక్రయిస్తున్నారు. నలుగురు కుటుంబ సభ్యులు ఉన్న ఇంటిలో బక్షాలు చేసుకోవాలంటే గతంలో రూ.300 ఖర్చు అవుతుండగా ప్రస్తుతం దాదాపు రూ.500 వరకూ వెచ్చించాల్సి వస్తోంది. నిత్యావసరాలతో పాటు కూరగాయల ధరలు కూడా పెరిగిపోయాయి. టమోట కిలో రూ.16, వంకాయకిలో రూ.30 ఉన్నా బెండ కిలో రూ.45, పచ్చిమిర్చి రూ.60, క్యాలీఫ్లవర్ రూ.44, చెవుళకాయ రూ.44, చిక్కుడు రూ.54 ఉన్నాయి. వాటికి తోడు సామాన్యులపై గ్యాస్ భారం పెరుగుతూ పోయింది. ఈ నెల 1న రూ.50 పెరగడంతో ప్రస్తుతం గ్యాస్ సిలింగర్ ధర రూ.1058గా ఉంది. దీంతో సామాన్యులు ఉన్న దాంతోనే పండగను చేసుకుంటున్నారు. కొంత మంది తక్కువ సంఖ్యలో బక్షాలతో పండగ చేసుకుంటుండగా మరికొందరు పాయసంతో సరిపెట్టుకుంటున్నారు.

మామిడాకులకూ గిరాకీ..

ఉగాదికి ఇంటిని మామిడాకులు, పూలతో అలంకరించి ఉగాది పచ్చడిని చేసుకుంటారు. గ్రామీణ ప్రాంతాల్లో మామిడాకులు మామిడి తోటల్లో దొరుకుతుండగా కర్నూలు, నంద్యాల వంటి పట్టణాల్లో మామిడాకులకు కూడా గిరాకీ ఉంటోంది. మార్కెట్లలో, రోడ్ల పక్కన మామిడాకులను కూడా విక్రయిస్తున్నారు. కట్ట మామిడాకులను రూ.వందకు విక్రయిస్తున్నారు. బంతి పూలు కిలో రూ.80 చొప్పున విక్రయిస్తున్నారు.



పండగ భారమే..



పెరిగిన నిత్యావసర ధరల వల్ల పండగ చేసుకోవడం భారంగా మారింది. కూరగాయల ధరలు కూడా మండుతున్నాయి. రూ.100కు మూడు రకాల కూరగాయలు రావడం లేదు. ఎక్కువ ఖర్చు అవుతుండటంతో పండగ చేసుకునే పరిస్థితి లేదు.

- అంజలి, ఆదోని.

పాయసంతో సరి..



ఉగాదికి సాధారణంగా బక్షాలు చేసుకునే వాళ్లం. ఇప్పుడు బక్షాలు చేసుకోవాలంటే కనీసం రూ.500 ఖర్చు అవుతోంది. నిత్యావసర సరుకుల ధరలు పెరగడం వల్ల ఉన్న దాంట్లో సర్దుకోవాల్సి వస్తోంది. ఈ సారి బక్షాల బదులు పాసయంతో సరిపెట్టుకోవాల్సిందే.

- పబ్బతి శివ ప్రసాద్, నందికొట్కూరు.

విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు చర్యలు

- కలెక్టర్ పి.కోటేశ్వర రావు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వర రావు పేర్కొన్నారు. జగనన్న గోరుముద్ద కింద రాగి జావా విద్యార్థులకు అందజేస్తున్నామన్నారు. మంగళవారం జగనన్న గోరుముద్ద కింద విద్యార్థులకు అందజేసే రాగిజావ కార్యక్రమాన్ని సిఎం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించారు. కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో, నగరంలోని బి క్యాంపులో గల ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో కార్యక్రమాన్ని ప్రారంభించారు. కలెక్టర్ పి.కోటేశ్వర రావు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, నగర మేయర్ బివై.రామయ్య, డిప్యూటీ మేయర్ సిద్దారెడ్డి రేణుక పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ... పౌష్టికాహారంతోనే ఆరోగ్యం, చక్కటి విద్యాభ్యాసం సాధ్యమని జగనన్న గోరుముద్దలో భాగంగా రాగిజావ అందించే కార్యక్రమం ప్రారంభించారు. రాగిజావ వల్ల విద్యార్థులలో ఐరన్ , క్యాల్షియమ్ వంటి పోషకాలు అందుతాయని పేర్కొన్నారు. ఇప్పటికే జగనన్న గోరుముద్దలో 15 ఆహార పదార్థాలు, గుడ్డు, చిక్కీ ఆందిస్తున్నారని ఇప్పటినుండి అదనంగా రాగిజావ ఇస్తారన్నారు. విద్యార్థులు అందరూ బాగా కష్టపడి చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని అన్నారు. పాణ్యం ఎమ్మెల్యే, నగర మేయర్ మాట్లాడుతూ.. ఎదిగే పిల్లలకు ఎటువంటి రక్తహీనత, విటమిన్ లోపాలు ఉండకూడదనే వారి ఆరోగ్యం మెరుగుదలకు జగనన్న గోరుముద్దలో అదనంగా పౌష్టికహారం కలిగిన రాగిజావాను ప్రారంభించారని అన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొన్న విద్యార్థులకు జ్ఞాపికలు అందజేశారు. కలెక్టర్ విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. డిఇఒ రంరెడ్డి, సర్వ శిక్ష అభియాన్ అడిషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ వేణు గోపాల్ పాఠశాల విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సామ్యూల్ పాల్, విద్యార్థులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కోటేశ్వరరావు

ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

- పట్టించుకోకుంటే చలో విజయవాడ : సిఐటియు

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించాలని లేనిచో చలో విజయవాడ కార్యక్రమం చేపడతామని సిఐటియు జిల్లా నాయకులు ఎం.గోపాల్, గఫూర్‌మియా, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి రమీజాబి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కనీస వేతనం, సంక్షేమ పథకాలు అమలు చేయాలని పని భారం తగ్గించాలని ఎఎన్‌ఎంలు, సచివాలయ సిబ్బంది వేధింపులు అరికట్టాలని వేతనంతో కూడిన సెలవులు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఆశా వర్కర్స్ యూనియన్ నాయకురాలు అనిత అధ్యక్షతన డిఎంఅండ్‌హెచ్‌ఒ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఆశాలని 4వ తరగతి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, రిటైర్ అయిన ఆశాల స్థానంలో వారి కుటుంబంలో అర్హత కలిగిన వారికి ఉద్యోగం కల్పించాలని కోరారు. రాజకీయ దురుద్దేశంతో అధికార పార్టీ అండతో ఆశాలను తొలగించాలని చూస్తున్న ఆశలకు ప్రభుత్వం వైద్య అధికారులనుంచి రక్షణ కల్పించాలని డిఎంహెచ్‌ఒ డాక్టర్ బి.రామ గిడ్డయ్యకు వినతి పత్రాన్ని అందజేశారు. డిఎంహెచ్‌ఒ ఆశాలను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతి నెలఆశాడే సందర్భంగా ఆశాల సమస్యలను నోడల్ అధికారికి తెలియజేయాలని, పరిష్కారం కాకపోతే తనకు నేరుగా కలిసి సమస్యలు విన్నవించుకోవాలని తన పరిధిలోని సమస్యలను పరిష్కరిస్తానని ప్రభుత్వం ద్వారా నెరవేరే కోర్కెలను ప్రభుత్వానికి నివేదిస్తానని ఆశాలకు తెలిపారు. ఈ సందర్భంగా ఆశార్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి రమీజాబి, జిల్లా నాయకులు గోపాల్ మాట్లాడుతూ ఆశాల సేవలు సమాజానికి ఎంతో ఉపయోగంగా ఉన్నాయని పేర్కొన్నారు. అంటువ్యాధులు ప్రబల కుండా చూడటంలో జబ్బులు తగ్గించడంలో సుఖప్రసవాలు పెంచడంలో ఆశాల సేవలు గణనీయంగా ఉన్నాయని అన్నారు. ప్రభుత్వం, వైద్య అధికారులు ఆశాల సేవలను గుర్తించడం లేదన్నారు. జగన్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఆశాలకు అనేక ఆశలు కల్పించి ఏవీ నెరవేర్చలేదన్నారు. విపరీతమైన పని భారం పెంచి చాలా ఇబ్బందులకు గురి చేస్తున్నదని నాయకులు తెలిపారు. తమకు సంబంధం లేని సర్వేలు బలవంతంగా ఆశాలతో ఎన్ఎంలు చేయిస్తూ చదువురాని వారని అవమాన పరుస్తూ మాట్లాడటం వారిపై అనేక విధాలా ఒత్తిడికి గురి చేస్తున్నారని ఆశాలకు సమయ పాలన లేకుండా పని చేయించుకుంటున్నారని నాయకులు తెలిపారు. ఆశాలను చిన్నచూపు చూస్తూ అనవసరంగా వేధింపులకు గురి చేస్తున్న వారిని అవమానకరంగా మాట్లాడిన ఏ అధికారినైనా సిఐటియు యూనియన్ మద్దతుతో నిలదీసి పోరాడాలని నాయకులు ఆశాలకు మనోధైర్యం కల్పించారు. రానున్న కాలంలో ప్రభుత్వం ఆశాల సమస్యలు పరిష్కరించక పోతే జగన్ ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని సిఐటియు నాయకులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. శేషమ్మ, వెంకటమ్మ, సుబేదా, శోభారాణి, భూదేవి, ఈశ్వరమ్మ పాల్గొన్నారు.



ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న రమీజాబి



రాతిదూలం పోటీలను ప్రారంభిస్తున్న గౌరు వెంకట్‌రెడ్డి

హుసేనాపురంలో రాతిదూలం పోటీలు

ప్రారంభించిన టిడిపి నంద్యాల అధ్యక్షులు గౌరు వెంకటరెడ్డి

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

ఓర్వకల్లు మండలం హుస్సేనాపురం గ్రామంలో ఉగాది పండుగ సందర్భంగా జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ మల్లెల రాజశేఖర్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి రాతి దూలం పోటీలను మంగళవారం నిర్వహించారు. ఈ పోటీలకు ముఖ్యఅతిథిగా హాజరైన టిడిపి నంద్యాల జిల్లా అధ్యక్షులు గౌరు వెంకట రెడ్డి, పాణ్యం మాజీ ఎమ్మెల్యే టిడిపి ఇన్‌ఛార్జి గౌరు చరిత రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కర్నూలు టిడిపి జిల్లా అధ్యక్షులు సోమిశెట్టి వేంకటేశ్వర్లు, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ మల్లెల రాజశేఖర్, నంద్యాల పార్లమెంటు మహిళా అధ్యక్షురాలు పార్వతమ్మ, ఓర్వకళ్ళు టిడిపి మండల అధ్యక్షుడు గోవింద్ ,రెడ్డి గుట్టపాడు సర్పంచ్ మోహన్ రెడ్డి, ఉప్పులపాడు సర్పంచ్ అయ్య స్వామి, రంగ స్వామి, పాణ్యం రాంపుల్లారెడ్డి, లాయర్ బాబు, గడివేముల ఈశ్వర్ రెడ్డి, పంట రామ చంద్ర రెడ్డి, దుర్వేశి కిట్టు యాదవ్, శ్రీనివాసులు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల అక్రమ తొలగింపు సబబేనా.!

ప్రజాశక్తి- సి బెళగల్

చాలీచాలని ,సక్రమంగా అందని వేతనాలతో బతుకీడుస్తున్న స్వచ్ఛ కార్మికుల అక్రమ తొలగింపులు సభభేనా అంటూ సిఐటియు నాయకులు మోహన్, సి బెళగల్ ఎంపిపి రాముడుపై విమర్శలు చేశారు. మంగళవారం పరిషత్ కార్యాలయం ముందు మండల కార్మికులతో ఆందోళన చేపట్టారు. రాజకీయ నాయకులకు ఎంపిడిఒ కొమ్ము కాస్తూ కడునిరుపేద కార్మికుల కడుపుకొడుతున్నారన్నారు. మండలంలో పలు గ్రామాల్లో అక్రమ తొలగింపులపై స్పష్టత నివ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జిఒ 680ను తెచ్చి కార్మికుల పట్ల ప్రభుత్వ వైఖరి మారడం లేదని, వేతనాలు ఇవ్వడంలో వేధింపులు తగదని హెచ్చరించారు. అనంతరం ఎంపిడిఒకు వినతిపత్రాన్ని అందజేశారు.

తెలుగు ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు ప్రజలందరికీ వైసిపి జిల్లా అధ్యక్షుడు, నగర మేయర్ బివై. రామయ్య శోభకృత్ నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉగాది పండుగ తెలుగు వారికి అత్యంత ముఖ్యమైన పండుగ అని, ప్రజలు ఆనందంగా, ఉత్సాహంగా జరుపుకునే ఈ నూతన సంవత్సరం అందరికీ కొత్త ఉత్తేజాన్ని, ఉల్లాసాన్ని, ఉజ్వల భవిష్యత్తును తేవాలని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు.

సాగు చేసుకుంటున్నా భూములకు పట్టాలివ్వాలి : సిపిఎం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ప్రభుత్వ స్థలాల్లో ఇల్లు కట్టుకుంటున్న పేదల భూములకు పట్టాలు ఇవ్వాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కెవి.నారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం కార్మిక కర్షక భవన్‌లో సిపిఎం సీనియర్ నాయకులు ఆంజనేయులు అధ్యక్షతన సిపిఎం కర్నూలు మండల కమిటీ సమావేశం నిర్వహించారు. కెవి.నారాయణ మాట్లాడుతూ అనేక సంవత్సరాలు నుండి పేద బడుగు బలహీన వర్గాలకు చెందిన ప్రజలు ఇంటి కోసం ఎదురుచూస్తూ సంవత్సరాలు గడిచినా ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోకపోవడంతో ప్రభుత్వ స్థలాల్లో ఇల్లు కట్టుకున్నారు. కర్నూలు మండలంలోని పసుపుల గ్రామంలో 200 మంది, గొందిపర్ల గ్రామంలో 100 మంది, అంబేద్కర్ నగర్‌లో వందమంది ఇండ్ల పట్టాలకోసం ఎదురుచూస్తున్నారని చెప్పారు. భూమిసాగు చేసుకుంటున్న అనేక కుటుంబాలు పట్టాల కోసం ఎదురుచూస్తున్నారని, వారికి వెంటనే పట్టాలు మంజూరు చేసి ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇల్లు లేని పేదల కోసం జగనన్న కాలనీల పేరుతో ఇల్లు కడుతున్నారని , ఆ ఇళ్ల నిర్మాణం పునాదుల దగ్గరే ఆగి పోయాయన్నారు. వెంటనే వాటిని పూర్తి చేసి లబ్ధిదారులకు అందించాలని కోరారు. లేకపోతే ప్రభుత్వానికి వ్యతిరేకంగా పేదలని ఐక్యం చేసి పోరాటం చేస్తామని హెచ్చరించారు. సిపిఎం మండల కార్యదర్శి పిబి హుస్సేనయ్య, మండల నాయకులు మృత్యుంజయుడు, వెంకటేశ్వర్లు, బీసన్న, రాఘవేంద్ర, నరసింహులు పాల్గొన్నారు.



మాట్లాడున్న కెవి.నారాయణ


నారాయణ లో ఉగాది సంబరాలు



ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

స్థానిక మాధవ నగర్ లోని నారా యణ పాఠశాలలో మంగళవారం ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపల్ మహమ్మద్ అల్తాప్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఉగాది పండగతోనే భారతీయు లంతా పండగలను ప్రారంభించడం ఆనవాయితీ అన్నారు. చిన్నారులు తయారు చేసిన ఉగాది పచ్చడిని అందరికీ అందజేశారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని విద్యార్థులు సహపంక్తి భోజనాలు చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ మహేశ్వరి, ముంతాజ్ బేగం, రాధ పాల్గొన్నారు.

కీళ్ల వ్యాధులకు చికిత్స



డాక్టర్ కిరణ్ కుమార్, ఆర్థోపెడిక్ స్పెషలిస్ట్ సూచనలు, సలహాలు

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

'కీళ్ళ వ్యాధులు అనేక రకాలు. ఈ కీళ్ళ వ్యాధులకు రకరకాల చికిత్సా విధానాలు వున్నాయి. కీళ్ల వ్యాధి చికిత్స ద్వారా తగ్గుముఖం పడుతుంది. చికిత్స వల్ల వ్యాధి గుణం తగ్గి, సామాన్య జీవితం సాధించటానికి వీలవుతుంది. చికిత్సా సమయంలో రోగి మానసిక స్థైర్యం, కుటుంబ సభ్యుల సహృద్భావ సహకారం చాలా అవసరం. ' అని ఆర్థోపెడిక్ స్పెషలిస్టు డాక్టర్ కిరణ్ కుమార్ అన్నారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం....

గతంలో కీళ్లవ్యాధి తీవ్రత అణిచి వుంచటానికి మాత్రమే చికిత్స జరిగేది. నేడు మెరుగైనచికిత్సా పద్ధతుల ద్వారా కొన్ని వ్యాధులు రాకుండా నివారించ గలుగుతున్నాం. ఉదాహరణకు రుమాటిక్ ఫీవర్, ఆధునిక యాంటి బయాటిక్స్ ద్వారా సెప్టిక్ ఆర్థరైటిస్, ఆస్టియోమైలైటిస్ వ్యాధులను పూర్తిగా నయం చేయవచ్చు. వ్యాధివల్ల కీపు బాగా చెక్కిపోయినప్పుడు తుంటి, మోకాళ్ళకు కృత్రిమ కీళ్ళు అమర్చడం వల్ల రోగికి స్వస్తత చేకూరుతుంది. ఆధునిక చికిత్సలో చాలారకాలుగా కీళ్ల వ్యాధుల పురోగతిని అరికట్టవచ్చును. రక్తపోటువలె ఈ కీళ్ళ వ్యాధులు దీర్ఘ కాలిక రోగాలు. రుమటాలజిస్ట్ పర్యవేక్షణలో మందులు దీర్ఘకాలం వాడాల్సి వుంటుంది. కొన్ని రకాల కీళ్ళ వ్యాధులకు చాలా సరళమైన, సఫలమైన చికిత్స ఉంటుంది. ఉదాహరణకు గౌట్ కొన్ని వ్యాధులకు పూర్తి నివారణ సాధ్యం కాకపోయనా, వ్యాధి లక్షణాలను బాధలను చికిత్సద్వారా నియంత్రించగలం. గతంకంటే ఆధునిక పద్ధతులు మెరుగైన ఔషధాలు, శస్త్ర చికిత్స విధానాలు వినియోగంలోకి వచ్చాయి.

చికిత్సలో ప్రధానాంశాలు: నొప్పి బాధలనుండి విముక్తి, కీళ్ళను స్వేచ్ఛగా కదిలించే శక్తిని సమకూర్చుట, మందులతో ప్రత్యేకమైన వ్యాధి చికిత్స.

మనోస్థైర్యం : రోగికి మనోస్థైర్యం చాలా అవసరం. వ్యాధిని బట్టి రోగి తన జీవన పద్ధతులను మార్పు చేసుకోవాలి. ఈ విషయంలో కుటుంబ సభ్యులు రోగాన్ని పూర్తిగా అవగాహన చేసుకొని రోగికిసహకరించటం ఎంతైనా అవసరం.

వ్యాయామం: రోగి వ్యాయామ చికిత్స తనకు తాను చేసుకోగలడు. చక్కటి వ్యాయామం వల్ల కీళ్ళు చక్కగా వంగుతాయి. వ్యాయామం వల్ల కీళ్ళకు అనుబంధంగా వుండే కండరాలు బలముగా తయారవుతాయి. దీనివల్ల నొప్పి తగ్గే అవకాశం వుంది. ఈత చాలా రకాల కీళ్ళ వ్యాధులకు చక్కని వ్యాయామం. క్రమమైన ఈత వ్యాయామము ద్వారా కండరాలు కీళ్ళు వంగి ఆరోగ్యాన్ని పునరుద్ధరించు కుంటాయి. తొడ కండరాల వ్యాయామం వల్ల మోకాళ్ల నొప్పులు చాలా వరకు తగ్గుతాయి.



కలెక్టర్ పి.కోటేశ్వరరావుకు వినతిపత్ర ఇస్తున్న అమరావతి జెఎసి నాయకులు

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

జిల్లా కలెక్టర్ కు జెఎసి అమరావతి నేతలు వినతి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఎపిజెఎసి అమరావతి జిల్లా చైర్మన్ గిరి కుమార్ రెడ్డి ఇతర నాయకులు పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం వర్క్ టు రూల్ నిరసన కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్లో ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ కోటేశ్వరరావు కు అమరావతి జెఎసి నేతలు కలిసి వినతిపత్రం ఇచ్చారు. జిల్లా చైర్మన్ గిరి కుమార్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కెవై.కృష్ణ, ప్రభుత్వం నుండి ఉద్యోగ, ఉపాధ్యాయ,కార్మిక,రిటైర్డు,కాంట్రాక్టు అండ్ ఔట్ సోర్సింగు ఉద్యోగులకు సంబందించిన ఆర్థిక, ఆర్థికేతర సమస్యల వెంటనే పరిష్కరించాలన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారం పై ప్రభుత్వం నుండి స్పష్టమైన హామీ వచ్చేంతవరకు ఈ ఆందోళన చేపడతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జెఎసి అమరావతి నేతలు నాగరాజు, వెంకటేశ్వర్ రెడ్డి, శోభ సువర్ణమ్మ, ఎవి రెడ్డి,శ్రీనివాసులు, డాక్టర్ ఎ.లక్ష్మణ్ , ఇతర నాయకులు పాల్గొన్నారు.



డయల్ యువర్ ఎస్ఇకి 9 వినతులు

ప్రజాశక్తి-కర్నూల్ కార్పొరేషన్

డయల్ యువర్ ఎస్ఇ కార్యక్రమానికి 9 వినతులు అందాయని ఎపిఎస్‌పిడిసిఎల్ ఎస్ఇ ఎం. ఉమాపతి తెలిపారు. మంగళవారం ఎస్ఇ కార్యాలయంలో నిర్వహించిన డయల్ యువర్ ఎస్ఇ కార్యక్రమంలో బిల్లింగ్ కు సంబంధించి ఒకటి, కరెంట్ లైన్‌లకు సంబంధించి1, స్తంభాలకు సంబంధించి 2, మీటర్లకు సంబంధించి ఫిర్యాదులు 1, కొత్త సర్వీస్ కావాలని ఒకటి, వ్యవసాయ సర్వీసులు కావాలని ఒకటి, ఇతరములు 2, మొత్తం 9 వినతులు ఫోన్ ద్వారా వినియోగదారులు తెలిపారని చెప్పారు. ఆర్థికపరమైన సమస్యలు మినహా చిన్న సమస్యలను వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తామని తెలిపారు.

ఆదర్శప్రాయుడు అప్పారి వెంకటస్వామి

- యుటిఎఫ్ నాయకులు



ఆదోనిలో నివాళులర్పిస్తున్న యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి - గోనెగండ్ల

ఉపాధ్యాయ సమస్యలే అజెండాగా ఉద్యమం నడిపిన అప్పారి వెంకటస్వామి నేటి తరానికి ఆదర్శప్రాయుడని యుటిఎఫ్ నాయకులు కొనియాడారు. మంగళవారం గోనెగండ్లలో మండల కమిటీ ఆధ్వర్యంలో అప్పారి వెంకటస్వామి వర్ధంతి నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి నరసింహులు మాట్లాడారు. అప్పారి వెంకటస్వామి సేవలను ఆదర్శంగా తీసుకొని సంఘం బలోపేతానికి పాటుపడాలని తెలిపారు. ఉపాధ్యాయుల సమస్యలే అజెండాగా ఉద్యమం చేస్తూ ఎనలేని సేవలు చేశారని చెప్పారు. మండల నాయకులు రామన్ చంద్రపాల్, దుబ్బన్న, జిక్రియా, గుమ్మల బాబు, విజయ్ కుమార్, లక్ష్మణ్, వరలక్ష్మి, స్వర్ణ మంజుల పాల్గొన్నారు. **ఆదోని** యుటిఎఫ్ కార్యాలయంలో పట్టణ గౌరవాధ్యక్షులు గిరిబాబు అధ్యక్షతన అప్పారి వెంకటస్వామి వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు ఎం.మల్లికార్జున మాట్లాడారు. యుటిఎఫ్ పట్టణ నాయకులు నగేష్, చక్రపాణి, ఎస్ఎఫ్ఐ నాయకులు శ్రీనివాసులు పాల్గొన్నారు.

'పది'లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

- ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు వీరన్న



బహుమతులు అందజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి - గోనెగండ్ల

పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులందరూ ఉత్తీర్ణులై ఉత్తమ ఫలితాలు సాధించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు వీరన్న, మండల అధ్యక్షులు ఖాజా తెలిపారు. గతంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు నిర్వహించిన టాలెంట్ టెస్టులో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. మంగళవారం గోనెగండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగభూషణం, ఇన్‌ఛార్జీ ప్రధానోపాధ్యాయులు అయ్యస్వాములు చేతులమీదుగా బహుమతుల ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పదో తరగతి విద్యార్థులు కష్టపడి చదివి ఉత్తీర్ణులై ఉత్తమ ఫలితాలు సాధించాలని తెలిపారు. ఉపాధ్యాయులకు, పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తేవడంతో పాటు భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు వెళ్లవచ్చని చెప్పారు. కెజిబివి ఇన్‌ఛార్జీ ప్రిన్సిపల్ రమాదేవి, సిబ్బంది రాధా రాణి, దేవయాని, ఉమా, యుటిఎఫ్ నాయకులు నరసింహులు, రామన్, చంద్రపాల్, జిక్రియా, గుమ్మల బాబు, హైస్కూలు ఉపాధ్యాయులు విజయకుమార్, అమానుల్లా బేగ్, భాస్కర్, ఎస్ఎఫ్ఐ నాయకులు సలీం, చిరంజీవి, ఛత్రపతి, రజాక్, అశోక్ పాల్గొన్నారు.

భక్తులు, గ్రామస్తుల సౌకర్యార్థం వాటర్ ప్లాంట్

- సిఐ శ్రీనివాసులు

ప్రజాశక్తి - మంత్రాలయం

భక్తులు, గ్రామస్తుల సౌకర్యార్థం పోలీసు శాఖ ఆధ్వర్యంలో మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసినట్లు సిఐ శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం పోలీసు స్టేషన్ అతిథి గృహం వద్ద ఏర్పాటు ప్లాంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గతంలో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్ చిన్న పాటి సమస్యలతో మూత పడిందని తెలిపారు. మళ్లీ మరమ్మతులు చేయించి నేడు ప్రారంభించామని పేర్కొన్నారు. మిషన్ ద్వారా రూ.2 కాయిన్ వేసి లీటర్ నీరు పొందవచ్చని తెలిపారు. రూ.5 కాయిన్ వేసిన వారు 10 లీటర్ల నీటిని పొందవచ్చని చెప్పారు. ఈ మినరల్ వాటర్ ప్లాంట్ ద్వారా సరఫరా చేసే తాగునీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎస్ఐ వేణుగోపాల్ రాజు పాల్గొన్నారు.

రీసర్వే పనులు పూర్తి : తహశీల్దార్

ప్రజాశక్తి - పెద్దకడబూరు

మండలంలోని అన్ని గ్రామాల్లో రీ సర్వే పనులు పూర్తయ్యాయని తహశీల్దార్ వీరేంద్ర గౌడ్ తెలిపారు. రీసర్వేలో భాగంగా మంగళవారం మండలంలోని బాపులదొడ్డి, గవిగట్టు గ్రామాల్లో తహశీల్దార్ ఆధ్వర్యంలో రాళ్లు పాతే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇప్పటికే చిన్న తుంబలం, నౌలేకల్, హెచ్.మురవణి గ్రామాల్లో మినహా మిగిలిన గ్రామాలకు మొత్తం 9,922 పట్టాదారు పాసు పుస్తకాలు వచ్చాయని తెలిపారు. కొన్ని గ్రామాల్లో పంపిణీ కూడా చేశామన్నారు. అలాగే భూ సర్వేకు సంబంధించి 22,258 మంది రైతుల పొలాలు సూచించే రాళ్లు వచ్చాయని చెప్పారు. రాళ్లు పాతే కార్యక్రమం బాపులదొడ్డి, గవిగట్టు గ్రామాల్లో జరుగుతోందని తెలిపారు. డిప్యూటీ తహశీల్దార్ మహేష్, సర్పంచి చిన్న మహాదేవ, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

ఉపాధి కల్పనలో బిజెపి విఫలం

- 'చలో ఢిల్లీ'ని జయప్రదం చేయండి
- సిఐటియు రాష్ట్ర నాయకులు గౌస్‌దేశాయి

ప్రజాశక్తి - దేవనకొండ

దేశంలోని యువతకు ఉపాధి కల్పించడంలో కేంద్రంలోని బిజెపి విఫలం చెందిందని సిఐటియు రాష్ట్ర నాయకులు డి.గౌస్‌దేశాయి విమర్శించారు. మంగళవారం దేవనకొండలోని అయ్యప్ప స్వామి గుడి ఆవరణలో సిఐటియు, రైతుసంఘం, వ్యకాస ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. నాయకులు సూరి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా గౌస్‌దేశాయి, వ్యకాస జిల్లా అధ్యక్షులు బి.వీరశేఖర్ మాట్లాడారు. రాబోయేవన్నీ మంచి రోజులన్న మోడీ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు చుక్కలు చూపిస్తోందని మండిపడ్డారు. పెరుగుతున్న ధరలు, నిరుద్యోగం, సరైన వేతనాలు లేకపోవడం, ఉపాధి కల్పనలో విఫలం చెందడం, నూతన విద్యా విధానం ద్వారా విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టించడం ద్వారా అన్ని వర్గాల ప్రజలకు ద్రోహం చేసిందన్నారు. కనీస వేతనాలు, గిట్టుబాటు ధర, 200 రోజుల ఉపాధి పని, అందరికీ ఉపాధి ప్రభుత్వ హామీ, ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు. నాణ్యమైన విద్యా వ్యవస్థ ద్వారా మెరుగైన సమాజాన్ని నిర్మించవచ్చని తెలిపారు. మూఢనమ్మకాలతో విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేసే కుట్ర జరుగుతోందని పేర్కొన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణకు, బ్యాంకులను నిలువు దోపిడీ చేసే చర్యలకు వ్యతిరేకంగా పోరాడాలని కోరారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక, రైతు, వ్యవసాయ కూలీ, యువజన, విద్యార్థి వ్యతిరేక విధానాలకు నిరసనగా దేశవ్యాప్తంగా ఏప్రిల్ 5న చేపట్టే 'చలో ఢిల్లీ'ని జయప్రదం



దేవనకొండలో మాట్లాడుతున్న గౌస్ దేశాయి

విజ్ఞప్తి చేశారు. వ్యకాస మండల కార్యదర్శి మహబూబ్ బాషా, సిఐటియు మండల కార్యదర్శి అశోక్, వ్యకాస నాయకులు యూసుఫ్ బాష, సిఐటియు నాయకులు పాండు, జ్యోతిలక్ష్మి, వెంకటలక్ష్మి, సరోజ, రైతు సంఘం నాయకులు శ్రీరాములు, బజారి, డివైఎఫ్ఐ మండల కార్యదర్శి మహబూబ్ బాషా, శ్రీనివాసులు, వీరన్న, పెద్దయ్య, ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్ష, కార్యదర్శులు కృష్ణ, తిరుమలేష్, ప్రజా సంఘాల నాయకులు బంటుపల్లి రాజు పాల్గొన్నారు. **ఎమ్మిగనూరులో** రైతు సంఘం, సిఐటియు, వ్యకాస, కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.రామాంజనేయులు హాజరయ్యారు. రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సి.హనుమంతు, బి.రామాంజనేయులు మాట్లాడారు. సిఐటియు మండల కార్యదర్శి బి.రాముడు, వ్యకాస జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.తిమ్మన్న, రైతు సంఘం నాయకులు లక్ష్మీ నరసయ్య, అబ్దుల్లా, సిఐటియు నాయకులు ఎన్.అంబేద్కర్, నాగరాజు, బి.రాజు, యు.రమేష్, ఫక్కీరప్ప, ఇస్సాక్ పాల్గొన్నారు. **ఆదోని (రూరల్)**లోని సుందరయ్య భవన్‌లో సిఐటియు, రైతుసంఘం, వ్యకాస ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. రైతు సంఘం మండల కార్యదర్శి అయ్యప్ప అధ్యక్షత వహించారు. వ్యకాస జిల్లా ఉపాధ్యక్షులు కె.లింగన్న, సిఐటియు మండల కార్యదర్శి బి.వీరారెడ్డి, అధ్యక్షులు రామాంజనేయులు, రైతు సంఘం మండల అధ్యక్షులు శేఖర్, వ్యకాస మండల అధ్యక్షులు రంగనాథ్, రైతుసంఘం, వ్యకాస, సిఐటియు మండల నాయకులు వీరేష్, చిన్న తిక్కన్న, అబ్దుల్ రహీం, రామప్ప, ఉరుకుంద పాల్గొన్నారు.



ఎమ్మిగనూరులో మాట్లాడుతున్న హనుమంతు



ఆదోనిలో కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

ఆల్ ఇండియా వీరశైవ మహా సభ కమిటీ

రాష్ట్ర ఉపాధ్యక్షులుగా వీరభద్ర గౌడ్



ప్రజాశక్తి-ఆలూరు

ఆల్ ఇండియా వీరశైవ మహాసభ కమిటీ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా టిడిపి ఆలూరు మాజీ ఇన్‌ఛార్జీ బి.వీరభద్ర గౌడ్ నియమితులయ్యారు. మంగళవారం రాష్ట్ర కమిటీని ఆల్ ఇండియా వీరశైవ మహాసభ కమిటీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే ఎస్.శివ శంకరప్ప ప్రకటించారు. ఆ కమిటీలో వీరభద్ర గౌడ్‌కు అవకాశం కల్పించారు .

వీరభద్రగౌడ్ ఎంపిక పట్ల హర్షం : ఆలూరు నియోజకవర్గ వీరశైవ సంఘం అధ్యక్షులు హోటల్ శాంతన్న వీరభద్ర గౌడ్, సభ్యులు బసవరాజు గౌడ్, ఈశ్వర్ గౌడ్, గజేంద్ర గౌడ్ హర్షం వ్యక్తం చేశారు.

వీరశైవ లింగాయత్‌ల సంక్షేమానికి కృషి
- వీరభద్ర గౌడ్

వీరశైవ లింగాయత్‌ల సంక్షేమానికి కృషి చేసి విద్య, ఉద్యోగ, వ్యాపార, రాజకీయ రంగాల్లో అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. తనకు రాష్ట్ర కమిటీలో అవకాశం కల్పించిన జాతీయ, రాష్ట్ర నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

నిధుల్లేకపోతే అభివృద్ధి ఎలా సాధ్యం

- సర్పంచుల సంఘం మండల అధ్యక్షులు



కొండా పురుషోత్తం

ప్రజాశక్తి - చిప్పగిరి

గ్రామాల్లో మౌలిక సదుపాయాలకు కూడా ప్రభుత్వాలు నిధులను మంజూరు చేయలేకపోతే సర్పంచులకు ఏం విలువ ఉంటుందని సర్పంచుల సంఘం మండల అధ్యక్షులు, కుందనగుర్తి సర్పంచి కొండా పురుషోత్తం ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన చిప్పగిరిలో మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలతో ఎన్నుకోబడిన సర్పంచులకు కనీస గౌరవం లేకుండా చేస్తున్నాయని తెలిపారు. గ్రామాల్లో అభివృద్ధి జరిగితేనే సర్పంచులకు విలువ ఉంటుందన్నారు. కనీసం ఎనర్జీస్ నిధులు కూడా సర్పంచులు ఖాతాలకు రానివ్వకుండా చేశారన్నారు. సర్పంచుల ఖాతాలకు వచ్చే నిధులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దారి మళ్లించడం సర్పంచులను కించపరచడమేనన్నారు. ఇలాగే కొనసాగితే నిరసన వ్యక్తం చేపట్టి ప్రభుత్వాలకు సరైన బుద్ధి చెబుతామన్నారు.

రాగి జావా పంపిణీతో పోషక విలువల పెంపు

- వైసిపి రాష్ట్ర యువ నేత ప్రదీప్ రెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లోని విద్యార్థులకు ఉదయం పూట రాగిజావా అందించడం అభినందనీయమని, రాగిజావాతో విద్యార్థుల్లో పోషణ విలువలు పెరుగుతాయని వైసిపి రాష్ట్ర యువ నేత వై.ప్రదీప్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు మండలంలోని రాంపురం ప్రభుత్వ పాఠశాలలో రాగి జావా అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జగనన్న గోరుముద్దలో భాగంగా ఉదయం పూట రాగి జావా చేర్చడం సంతోషంగా ఉందని తెలిపారు. ఈ రాగి జావా వల్ల ఐరన్, కాల్షియం వంటి పోషకాలు అందుతాయని చెప్పారు. విద్యార్థుల్లో రక్తహీనత, పోషకాల లోపాన్ని నివారించేందుకు వారానికి 3 రోజులు బెల్లంతో కూడిన రాగిజావాను విద్యార్థులకు అందిస్తున్నట్లు తెలిపారు. అలాగే 52 బసాపురం గ్రామంలో వైసిపి మండల అధ్యక్షులు జి.భీమిరెడ్డి, సర్పంచి రాఘవరెడ్డి రాగిజావా పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. మహిళా పోలీసు శాంతి, విఎఒ హైమావతి, ఇంజినీరింగ్ అసిస్టెంట్ ఆశా, ప్రధానోపాధ్యాయులు నాగరాజు, హసీనా, రాజేశ్వరి, సిఆర్‌పి భీమేష్ పాల్గొన్నారు. **గోనెగండ్ల** మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా రాగిజావా పంపిణీని చేపట్టారు. ఎంపిపి టి.నసురుద్దీన్, ఎంఇఒ వినోద్ కుమార్ పంపిణీని లాంఛనంగా ప్రారంభించారు. హై స్కూలు, మెయిన్ స్కూలు, బస్టాండ్ స్కూలు, ఎపి మోడల్ పాఠశాలలో ప్రిన్సిపల్ షాహినా పర్వీన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు రాగిజావా పంపిణీ చేశారు. మెయిన్ స్కూల్ ప్రధానోపాధ్యాయులు బతుకన్న, పద్మనాభం, గోవిందు, గాజుల ఉస్మాన్, అబ్బుసా మాబు పాల్గొన్నారు. **కోసిగి (రూరల్)** మండల పరిషత్ ప్రాథమిక జెబిఎం స్కూలులో ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి, వైసిపి మండల ఇన్‌ఛార్జీ మురళీమోహన్ రెడ్డి ఆదేశాల మేరకు రాగి జావా పంపిణీని ప్రారంభించారు. ఎంపిపి ఈరన్న, ప్రధానోపాధ్యాయులు రాజమౌళి, ఉపాధ్యాయులు ప్రశాంత్, మహ్మద్, వైసిపి నాయకులు వెంకటేష్, ఈరన్న పాల్గొన్నారు. **దేవనకొండ** జిల్లా పరిషత్ హైస్కూల్‌లో మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు రాగి జావాను పంపిణీ చేశారు. ఐసిడిఎస్ సూపర్‌వైజర్ సుమిత్ర, జడ్‌పి హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు సుభాషిని, జడ్‌పిటిసి కిట్టు, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు కాకర్ల శాంతి కుమార్ పాల్గొన్నారు. అలాగే తెర్నేకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సర్పంచి అరుణ్ కుమార్, కప్పట్రాళ్ల జిల్లా పరిషత్ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలో వైసిపి మండల కన్వీనర్ కప్పట్రాళ్ల మల్లికార్జున రాగి జావాను పంపిణీ చేశారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సివి.సుధాకర్, విద్యా కమిటీ ఛైర్మన్లు రంజిత్ బాష, చిన్న వెంకప్ప, వైసిపి నాయకులు చిట్టెం చిన్నయ్య శెట్టి, నరసప్ప, మద్దిలేటి పాల్గొన్నారు. **పెద్దకడబూరు** మండలంలోని కల్లుకుంట గ్రామంలో జగనన్న గోరుముద్దలో భాగంగా రాగిజావా పంపిణీ చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు విజయ్ కుమారి, సర్పంచి ఇస్మాయిల్, డీలర్ నరసింగప్ప, వైసిపి కార్యకర్తలు తిక్కన్న, చిలకలడోన లక్ష్మన్న పాల్గొన్నారు. **చిప్పగిరి** మండలంలోని ఏరూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం ఆదేశాల మేరకు వైసిపి మండల కన్వీనర్ గుమ్మనూరు నారాయణ ఆధ్వర్యంలో వైసిపి నాయకులు రాజన్న, బాలకృష్ణలు విద్యార్థులకు రాగిజావాను అందజేశారు. వైసిపి అసెంబ్లీ బూత్ కమిటీ సభ్యులే ఏరూరు రాజన్న, ఏరూరు జిల్లా ఉన్నత పాఠశాల విద్యా కమిటీ ఛైర్మన్ బాలకృష్ణ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ రెడ్డి, సచివాలయ కన్వీనర్ రాజన్న పాల్గొన్నారు. **హాలహర్వి** మండలంలోని హర్ధగేరి ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం ఆదేశాల మేరకు రాగిజావాను అందజేశారు. సొసైటీ ఛైర్మన్ శ్రీనప్ప, హర్ధగేరి సర్పంచి గురుదాస్ రెడ్డి పాల్గొన్నారు. **ఆదోని** పట్టణంలోని కిల్చిన్ పేట పురపాలక ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు రాగి జావాను అందించారు. ప్రధానోపాధ్యాయులు సునీల్ రాజ్ కుమార్, బ్రహ్మానందరెడ్డి, విజయ్ మోహన్, నవీన్, చంద్రకళ, జెరుషా, రత్న కుమారి, వార్డు మెంబర్ రామకృష్ణ పాల్గొన్నారు. **ఆస్పరి** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యా కమిటీ ఛైర్మన్ గోవర్ధన్ ఆధ్వర్యంలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాగిజావాను విద్యార్థులకు అల్పాహారంగా అందించారు. సింగిల్ విండో ఛైర్మన్ కట్టెల గోవర్ధన్, ప్రధానోపాధ్యాయులు సుజాత పాల్గొన్నారు.



మంత్రాలయంలో రాగిజావాను పంపిణీ చేస్తున్న ప్రదీప్ రెడ్డి



గోనెగండ్లలో



కోసిగిలో



దేవనకొండలో



చిప్పగిరిలో

గృహ నిర్మాణాలను వేగవంతం చేయండి : ఆర్‌డిఒ

ప్రజాశక్తి - దేవనకొండ

మండలంలో జగనన్న ఇంటి నిర్మాణాలను వేగవంతం చేయాలని పత్తికొండ ఆర్‌డిఒ మోహన్ దాస్, గృహ నిర్మాణ శాఖ ఇఇ గురుదాస్ ఆదేశించారు. మంగళవారం తహశీల్దార్ సుదర్శనం ఆధ్వర్యంలో దేవనకొండ మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మండలంలోని అన్ని గ్రామ సచివాలయ పరిధిలో 1,960 గృహ నిర్మాణాలు ఉండగా, 493 పూర్తయ్యాయని తెలిపారు. 70 పైకప్పు, 143 ఆర్ఎల్, 180 బేస్ మట్టం లెవెల్‌లో ఉన్నాయన్నారు. ఏప్రిల్ 14న అంబేద్కర్ జయంతి నాటికి ఇంటి నిర్మాణాలను పూర్తి చేయాలని ఆదేశించారు. ఇంటి నిర్మాణాల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండల హౌసింగ్ ఇంజినీర్ అనిరుధ్ పాల్గొన్నారు.

క్షయ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలి : మెడికల్ ఆఫీసర్

ప్రజాశక్తి - ఆదోని

క్షయ (టిబి) వ్యాధి పట్ల నిర్లక్ష్యం వహించకుండా అప్రమత్తంగా ఉండాలని మెడికల్ ఆఫీసర్ షేకున్ బీ, ఎంపిహెచ్ఒ బాబురాజు తెలిపారు. మంగళవారం పట్టణంలోని వివేకానంద హైస్కూల్‌లో టిబి వ్యాధిపై విద్యార్థులు, ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. టిబి రోగులను పరీక్షించి వారికి మాక్ సెంటర్ నుంచే మందులు ఇస్తారని తెలిపారు. రెండు వారాల పాటు దగ్గు ఉంటే టిబిగా అనుమానించాలని చెప్పారు. టిబి ఉన్న వ్యక్తికి ఉదయం, సాయంత్రం జ్వరం వస్తూ ఉంటుందన్నారు. బరువు తగ్గడం, శ్వాస తీసుకోవడంలో కష్టంగా ఉండడం, రక్తపు ఛారలతో కూడిన గల్ల పడడం తదితర లక్షణాలు ఉన్న వారు ఉదయం తీసిన గల్లను తీసుకొస్తే నిర్ధారణ కోసం పరీక్షకు పంపుతామని తెలిపారు. పుట్టిన ప్రతి బిడ్డకూ బిసిజి వ్యాక్సిన్ వేయించాలన్నారు. వ్యక్తికి వ్యక్తికి రెండు మీటర్ల దూరం పాటించడం, దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు మోచేతిని అడ్డం పెట్టకోవడం, సమతుల్య ఆహారం తీసుకోవడం వల్ల ఈ వ్యాధి నుంచి విముక్తి పొందవచ్చని తెలిపారు. టిబిహెచ్‌వి మనోరంజని, ఎఎన్ఎం సంతోషమ్మ, 5వ వార్డు ఆశాలు లక్ష్మీ, సునీత పాల్గొన్నారు.

పాఠశాల అపరిశుభ్రతపై సబ్ కలెక్టర్ ఆగ్రహం

- సచివాలయాలు, 'నాడు - నేడు' పనులపై ఆరా

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

మండలంలోని కోటేకల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో అపరిశుభ్రతంగా ఉన్నందున ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలను క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. మొదట తరగతి గదిలోకి వెళ్లి ఉపాధ్యాయుల బోధన తీరును పరిశీలించారు. విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడుతూ... వారి నైపుణ్యతను గమనించారు. నాడు-నేడు కింద నిర్మిస్తున్న పాఠశాల నిర్మాణ పురోగతిని పరిశీలించారు. అనంతరం పాఠశాలలో విద్యార్థులకు నిర్మించిన బాత్‌రూములను, పాఠశాల పరిసరాల్లో మల విసర్జన చూసి అసహనానికి గురై అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 'మీ ఇంటి పరిసరాల్లో ఇలానే ఉంచుకుంటారా' అని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాల అంటే విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే దేవాలయం లాంటిదని తెలిపారు. అలాంటి పాఠశాలపై నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదన్నారు. అనంతరం గ్రామంలోని సచివాలయాన్ని తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు పట్టిక, మూవ్‌మెంట్ రిజిస్టర్, పలు రికార్డులను తనిఖీ చేశారు. ఫీవర్ సర్వే, వాలంటీర్ సమావేశాలు, వాటి వివరాల గురించి కూడా ఆరా తీశారు. క్షేత్రస్థాయిలో గర్భిణుల ఆరోగ్య పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవసరమైన వైద్య సహాయం కృషి చేయాలని అక్కడే ఉన్న వైద్య సిబ్బందికి సూచించారు. నిర్లక్ష్యాన్ని వీడి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆదేశించారు. మండల స్థాయి అధికారులు కూడా సచివాలయాలు, పాఠశాలలను క్రమం తప్పకుండా పరిశీలించి గ్రౌండ్ లెవెల్‌లో ఏదైనా లోపాలుంటే వాటిని సరి చేసి ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేయాలన్నారు. తహశీల్దార్ జయన్న, ఎంపిడిఒ బంగారమ్మ, ఎంఇఒ ఆంజనేయులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న అభిషేక్ కుమార్

చర్చి నిర్మాణంపై

హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలో కొలువైన శ్రీరాఘవేంద్రస్వామి సన్నిధిలో చర్చి నిర్మాణ పనులను నిలిపేయాలని హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. మంగళవారం జిల్లా పంచాయతీ అధికారి నాగరాజు నాయుడు రామచంద్ర నగర్ కాలనీలోని చర్చిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పిటిషనర్లు పి.కర్ణ, సి.నరసింహ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసి రెవరెండ్ వేదనాయకంకు ముందస్తు నోటీసులు జారీ చేశారని పేర్కొన్నారు. మళ్లీ ఈనెల 21న పంచాయతీ కార్యదర్శి నాగరాజు, విఆర్ఒ భీమనగౌడు ఆధ్వర్యంలో సర్వే నెంబరు 137/2లో చర్చి నిర్మాణ పనులను నిలిపేయాలని సంఘ పెద్దలకు, రెవరెండ్ వేదనాయకంకు నోటీసు ద్వారా తెలిపినట్లు చెప్పారు. మళ్లీ కోర్టు ఉత్తర్వులు వచ్చే వరకు నిర్మాణాలు ఆపాలని తెలిపారు.

నేటి నుంచి ఉగాది ఉత్సవాలు...

ప్రజాశక్తి - ఆదోని

మండలంలోని అలసందగుత్తి గ్రామంలో ఉగాది సందర్భంగా ఐదు రోజులపాటు ఉగాది ఉత్సావాలు నిర్వహిస్తారు. అలసంద గుత్తి గ్రామ సృష్టికర్తలుగా శ్రీచౌడేశ్వరి దేవి, శ్రీసోమేశ్వర స్వామి నామకరణంతో గ్రామం అవతరించిందని పూర్వీకుల కథనం. ఉగాది సందర్భంగా దేవాలయాలను విద్యుత్ కాంతులతో అలంకరించారు. ఉగాది అమావాస్య రోజున రంగుల పండగ (హోలి) కుల, మతాలకు, వర్గ భేదాలకు అతీతంగా రంగులు చల్లుకుంటూ కలిసికట్టుగా నిర్వహిస్తారు. అలసంద గుత్తి గ్రామానికి చెందిన ప్రజలు సుదూర ప్రాంతాల్లో స్థిరపడినా, వలసలు వెళ్లినా ఉగాది ఉత్సవాలకు గ్రామానికి చేరుకుంటారు. ఆడపడుచులు పుట్టిళ్లకు చేరుకొని నూతన దుస్తులతో వేడుక జరుపుకుంటారు. ఉగాది పాడ్యమి రోజు భక్షాలు, కాయ, కర్పూరం, పూలమాలతో గ్రామంలో ఉన్న శ్రీసుంకులమ్మ అవ్వ, శ్రీలక్ష్మమ్మ అవ్వ, శ్రీగలిదేవర, శ్రీసెట్టెమ్మవ్వ స్వాములకు సమర్పిస్తారు. గురువారం సాయంత్రం 6 గంటల నుంచి సర్కార్ పోతు కుంభం మొదలుకొని గ్రామంలో ఉన్న కుంభాలను వరుస సంఖ్యలో డప్పు, వాయిద్యాలతో సేకరిస్తారు. రాత్రి 12 గంటలు దాటిన తర్వాత శ్రీచౌడేశ్వరి దేవికి కుంభాల్లో ఉన్న నైవేధ్యాన్ని సమర్పిస్తారు. దేవాలయం చుట్టూ పోలి చల్లి పొట్టేళ్లను, మేకపోతులను, గేదెలను బలి ఇస్తారు. బలి చేసిన తర్వాత దేవాలయ ఆవరణలో ఎవరూ బస చేయకుండా గ్రామ పెద్దలు ప్రత్యేక చర్యలు తీసుకుంటారు. శుక్రవారం వేకువ జామున 4 గంటలకు సోమేశ్వర స్వామి రథోత్సవం మీదుగా శ్రీఆంజనేయ స్వామి దేవాలయం వద్దకు చేరుకొని అక్కడ గ్రామస్తులు ప్రత్యేక పూజలు అందజేస్తారు. గ్రామంలో పురవీధుల గుండా సోమేశ్వర స్వామిని రథోత్సవం మీద వెళ్లి చౌడేశ్వరి, సోమేశ్వర స్వామి దేవాలయానికి చేరుకుని అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అనంతరం మధ్యాహ్నం గ్రామ నడిబొడ్డున వెలిసిన శ్రీసుంకులమ్మ దేవి, గ్రామ అంచున వెలసిన లక్ష్మమ్మ దేవికి కుంభోత్సవం నిర్వహిస్తారు. పొట్టేళ్లను, మేకపోతులను, గేదె దూడలను బలి ఇస్తారు. కుంభోత్సవం నిర్వహించేందుకు అలసంద గుత్తి గ్రామ ప్రజలే కాకుండా కర్ణాటక ప్రాంతం బళ్లారి, ఎమ్మిగనూరు మండలం వివిధ గ్రామాల నుంచి గ్రామ చుట్టుపక్కల ఉన్న బసరకోడు, సలకలకొండ, ఉవ్వగనూర్ పలు గ్రామాల ప్రజలు తరలివస్తారు. గ్రామంలో ఉగాది ఉత్సవాల కోసం ఆలయ కమిటీ ధర్మకర్త ఆధ్వర్యంలో గ్రామ పెద్దలు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. ఉగాది ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ చోటు చేసుకోకుండా తాలూకా ఎస్ఐ గోపాల్ రెడ్డి బందోబస్తు మధ్య గురువారం కుంభోత్సవం నిర్వహిస్తారు.



ప్రజాశక్తి
బుధవారం 22 మార్చి 2023
5
నంద్యాల





ఉగాదికి ధరాఘాతం

- పెరిగిన ధరలతో సామాన్యుల బెంబేలు
- పండగ పూట భక్ష భోజనం కష్టమే



ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

ఉగాదికి సామాన్యులకు ధరాఘాతం తప్పడం లేదు. పెరిగిన ధరలతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. పండగ పూట బక్ష భోజనం కష్టంగా మారింది. చాలా మంది ఉన్న దాంట్లోనే సర్దుకుని పండగను చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది...

తెలుగు పండగల్లో తొలి పండగ తెలుగు సంవత్సరాది ఉగాది. తెలుగు రాష్ట్రాల్లో గతంలో ఈ పండగ సందడిగా ఉండేది. సామాన్యులకు ఈ ఉగాదికి ధరాఘాతం తప్పడం లేదు. ఉగాది ప్రత్యేకంగా జిల్లాలో చాలా మంది బక్షాలను చేసుకుంటారు. నిత్యావసర ధరలకు రెక్కలు రావడంతో సామాన్యులకు పండగ పూట బక్ష భోజనం కష్టంగా మారనుంది. బక్షాలకు ప్రధానంగా నూనె, బెల్లం, శనగలు, మైదాను ఉపయోగిస్తారు. లీటర్ పామాయిల్ ప్యాకెట్ రూ.120, సన్‌ఫ్లవర్ ఆయిల్ రూ.140 నుంచి రూ.170 వరకూ పలుకుతోంది. ఇతర సరుకుల ధరలు కూడా ఎక్కువగానే ఉన్నాయి. కర్నూలు నగరంలో కిలో శనగ బ్యాళ్లు రూ.80, మొదటి రకం బెల్లం రూ.80, రెండో రకం బెల్లం రూ.55గా ఉన్నాయి. ఆదోనిలో కిలో శనగ బ్యాళ్లు రూ.100 నుంచి రూ.130, బెల్లం రూ.50, మైదా రూ.40కు అమ్ముతున్నారు. నందికొట్కూరులో కిలో శనగ బ్యాళ్లు రూ.90, బెల్లం రూ.60 నుంచి రూ.70, మైదా రూ.65కు విక్రయిస్తున్నారు. నలుగురు కుటుంబ సభ్యులు ఉన్న ఇంటిలో బక్షాలు చేసుకోవాలంటే గతంలో రూ.300 ఖర్చు అవుతుండగా ప్రస్తుతం దాదాపు రూ.500 వరకూ వెచ్చించాల్సి వస్తోంది. నిత్యావసరాలతో పాటు కూరగాయల ధరలు కూడా పెరిగిపోయాయి. టమోట కిలో రూ.16, వంకాయకిలో రూ.30 ఉన్నా బెండ కిలో రూ.45, పచ్చిమిర్చి రూ.60, క్యాలీఫ్లవర్ రూ.44, చెవుళకాయ రూ.44, చిక్కుడు రూ.54 ఉన్నాయి. వాటికి తోడు సామాన్యులపై గ్యాస్ భారం పెరుగుతూ పోయింది. ఈ నెల 1న రూ.50 పెరగడంతో ప్రస్తుతం గ్యాస్ సిలింగర్ ధర రూ.1058గా ఉంది. దీంతో సామాన్యులు ఉన్న దాంతోనే పండగను చేసుకుంటున్నారు. కొంత మంది తక్కువ సంఖ్యలో బక్షాలతో పండగ చేసుకుంటుండగా మరికొందరు పాయసంతో సరిపెట్టుకుంటున్నారు.

మామిడాకులకూ గిరాకీ..

ఉగాదికి ఇంటిని మామిడాకులు, పూలతో అలంకరించి ఉగాది పచ్చడిని చేసుకుంటారు. గ్రామీణ ప్రాంతాల్లో మామిడాకులు మామిడి తోటల్లో దొరుకుతుండగా కర్నూలు, నంద్యాల వంటి పట్టణాల్లో మామిడాకులకు కూడా గిరాకీ ఉంటోంది. మార్కెట్లలో, రోడ్ల పక్కన మామిడాకులను కూడా విక్రయిస్తున్నారు. కట్ట మామిడాకులను రూ.వందకు విక్రయిస్తున్నారు. బంతి పూలు కిలో రూ.80 చొప్పున విక్రయిస్తున్నారు.

పాయసంతో సరి..



ఉగాదికి సాధారణంగా బక్షాలు చేసుకునే వాళ్లం. ఇప్పుడు బక్షాలు చేసుకోవాలంటే కనీసం రూ.500 ఖర్చు అవుతోంది. నిత్యావసర సరుకుల ధరలు పెరగడం వల్ల ఉన్న దాంట్లో సర్దుకోవాల్సి వస్తోంది. ఈ సారి బక్షాల బదులు పాసయంతో సరిపెట్టుకోవాల్సిందే.

- పబ్బతి శివ ప్రసాద్, నందికొట్కూరు.

అంగరంగ వైభవంగా ప్రభోత్సవం

- నంది వాహనంపై స్వామి అమ్మవార్లు - మహా సరస్వతి అలంకారంలో అమ్మవారు



ప్రజాశక్తి - శ్రీశైలం

ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీశైలం క్షేత్రంలో జరుగుతున్న ఉగాది మహోత్సవాలలో మంగళవారం స్వామి అమ్మవార్లకు ప్రభోత్సవం, నంది వాహన సేవ, భ్రమరాంబ దేవికి మహా సరస్వతి అలంకారం కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం నుండి రాత్రి వరకు ప్రత్యేక పూజలు నిర్వహించి, సాయంకాలం ప్రభోత్సవం నిర్వహించారు. అనంతరం పల్లకిలో మంగళ వాయిద్యాల మధ్య రథశాల వద్దకు తీసుకురావడం జరిగింది. 11 రకాల పూలతో అలంకరించి ఏర్పాటు చేసిన ప్రభోత్సవంలో స్వామి అమ్మ వార్ల ఉత్సవ మూర్తులను ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆ తర్వాత రథసాల వద్ద నుండి నంది గుడి వరకు, తిరిగి నంది గుడి వద్ద నుండి రథసాల వద్ద వరకు వివిధ రకాల మధ్య ప్రదర్శన, కళాకారుల మధ్య ప్రభోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా సంప్రదాయబద్ధంగా నిర్వహించారు.

నంది వాహనంపై స్వామి అమ్మవార్లు

ఉత్సవాల్లో భాగంగా ప్రభోత్సవ అనంతరం అలంకార మండపంలో స్వామి అమ్మవారి ఉత్సవ మూర్తులను వివిధ రకాల పూలతో అలంకరించిన నంది వాహనంపై ఏర్పాటు చేసి విశేష పూజలు నిర్వహించారు. అలాగే అమ్మవారిని మహా సరస్వతి అలంకారంలో అలంక రించారు. ఆ తర్వాత చెక్కభజన, కోలాటం కళారూపాల మధ్య గ్రామోత్సవం నిర్వహించారు.

అగ్నిగుండ ప్రవేశం : ఉగాది ఉత్సవాలలో భాగంగా స్వామి అమ్మవార్ల భక్తులు మంగళవారం రాత్రి అగ్నిగుండ ప్రవేశం చేసి వీరాచార విన్యాసాలు నిర్వహించారు. పాతాళ గంగ రోడ్డు లోని శివదీక్ష శిబిరాలలో అగ్నిగుండాన్ని ఏర్పాటు చేశారు. సంప్రదాయంగా ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా నాలుకకు సువ్వలు, గొంతుకు, బుగ్గలకు గుచ్చుకొని అగ్నిగుండ ప్రవేశం చేసి భక్తిని చాటుకున్నారు.

నేడు ఉగాది: నేడు తెలుగు సంవత్సరాది ఉగాది నూతన సంవత్సరం స్వామి అమ్మ వాళ్లకు విశేష పూజ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటలకు కళ్యాణ మండపంలో పంచాంగ శ్రవణం కార్యక్రమం దేవస్థానం ఆస్థాన సిద్ధాంతి పండిత బుట్టే వీరభద్ర దైవజ్ఞ నిర్వహిస్తారు. ఆ తర్వాత సాయంకాలం రథోత్సవ కార్యక్రమాన్ని వైభవంగా వేలాది మంది భక్తుల మధ్య సాంప్రదాయం ప్రకారం నిర్వహిస్తారు. అమ్మవారికి రమావాణి సేవిత రాజరాజేశ్వరి అలంకారంలో అలంకరించి భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు.

విద్యార్థులకు రాగి జావ

- వారంలో మూడు రోజులు పంపిణీ
- జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్
- తాడేపల్లి నుండి ప్రారంభించిన సిఎం జగన్‌మోహన్ రెడ్డి


వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి లైవ్ ద్వారా వీక్షిస్తున్న కలెక్టర్, ఎంపి తదితరులు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

జిల్లాలోని 1369 ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న 1,52,638 విద్యార్థులకు జగనన్న గోరుముద్దలో భాగంగా 150 ఎంఎల్ రాగి జావా అందిస్తున్నామని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్ తెలిపారు. మంగళవారం తాడేపల్లి క్యాంప్ కార్యాలయం నుండి రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి జగనన్న గోరుముద్దలో భాగంగా మరో పౌష్టికాహారం రాగి జావా అందించే కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్‌తో పాటు నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, మున్సిపల్ చైర్మన్ మాబున్నిసా, డిఇఒ అనురాధ, విద్యార్థులు తదితరులు ఈ కార్యక్రమాన్ని లైవ్ ద్వారా వీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు వారంలో మూడు రోజులపాటు 150 ఎంఎల్ రాగి జావా అందిస్తామని తెలిపారు. గతంలో కంటే ప్రస్తుతం మధ్యాహ్న భోజన పథకంలో పెనుమార్పులు తీసుకొచ్చి రోజుకో మెనూ ప్రకారం రుచికరమైన పౌష్టికాహారంతో కూడిన ఆహార పదార్థాలు అందిస్తున్నామని చెప్పారు. ఐరన్, కాల్షియం లాంటి పోషకాలు అందించి విద్యార్థుల్లో రక్తహీనత, పౌష్టికాహార లోపాన్ని నివారించేందుకు బెల్లంతో కూడిన రాగిజావను అందించే మంచి కార్యక్రమాన్ని సిఎం ప్రారంభించారని తెలిపారు. అనంతరం కలెక్టర్‌తో పాటు ఎంపీ, మున్సిపల్ చైర్మన్, డిఇఒలు విద్యార్థులకు రాగి జావా పంపిణీ చేశారు. **బనగానపల్లె :** విద్యార్థిని, విద్యార్థులకు అదనపు పోషకాహారం అందించడమే సిఎం జగన్మోహన్ రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో రాగిజావ విద్యార్థులకు పంపిణీ చేసి ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో వైసిపి అవుకు మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డి, ఎంపీడీవో శివరామయ్య, ఎంఈఓ స్వరూపారాణి, **(మిగతా 6వ పేజీలో...)**

ఆశాలపై పని భారం తగ్గించాలి

- ప్రభుత్వ సెలవులు ఇవ్వాలి - సిఐటియు, ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ డిమాండ్
- డిఎంహెచ్‌ఒ కార్యాలయం ఎదుట ధర్నా




డిఎంహెచ్‌ఒకు వినతి పత్రం అందచేస్తున్న నాయకులు, ఆశా వర్కర్లు

ర్యాలీగా వస్తున్న ఆశా వర్కర్లు, సిఐటియు నాయకులు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ఆశా వర్కర్లపై పని భారాన్ని తగ్గించాలని, ప్రభుత్వ సెలవులు మంజూరు చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు వి.ఏసురత్నం, ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రమణకుమారి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా సోమవారం నంద్యాలలోని సిఐటియు జిల్లా కార్యాలయం నుండి ఆశా వర్కర్లు ర్యాలీగా బయలుదేరి స్థానిక గవర్నమెంట్ ఆసుపత్రిలోని డిఎంహెచ్వో కార్యాలయంకు చేరుకుని ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకురాలు జి.నాగమణి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆశా వర్కర్ల నియామకాల్లో రాజకీయ జోక్యం తగ్గించాలని, ప్రభుత్వమే నియామకాలు జరపాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్, గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం సంక్షేమ పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆశలకు సంబంధం లేని పనులు చేయించరాదని తెలిపారు. విధి నిర్వహణలో మరణించిన ఆశాలకు వారి కుటుంబ సభ్యులకు నియామకాల్లో ప్రాధాన్యత కల్పించాలన్నారు. ప్రభుత్వ సెలవులు, మెడికల్ లీవులు వేతనంతో కూడిన మెటర్నరీలు ఇవ్వాలన్నారు. రూ.10 లక్షల గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలన్నారు. రికార్డులు ప్రభుత్వమే ఇవ్వాలని, 104 ఉద్యోగుల కోసం ఆశా వర్కర్లతో ఎటువంటి అదనపు ఖర్చులు చేయించరాదని డిమాండ్ చేశారు. నాణ్యమైన సెల్ ఫోన్స్ ఇవ్వాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్, సంక్షేమ పథకాలు అమలు చేయాలని, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లను ఆశాలుగా మార్పు చేయాలని, వ్యాక్సిన్ క్యారియర్ ఆశ వర్కర్లతో తెప్పించరాదని డిమాండ్ చేశారు. అనంతరం డిఎంహెచ్‌ఒ డాక్టర్ వెంకట రమణకు వినతి పత్రం అందజేశారు. డిఎంహెచ్‌ఒ మాట్లాడుతూ సమస్యలన్నిటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీనిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శులు వి.బాల వెంకట్, డి.లక్ష్మణ్, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకురాలు మాధవి, చెన్నమ్మ, తిరుపాలమ్మ, శివమ్మ, శిరోమణి, భారతి, కపావతి, సరస్వతి, వెంగమ్మ, సులోచన, విజయలక్ష్మి,


మాట్లాడుతున్న అధ్యక్ష, ఉపాధ్యక్షులు

25న సత్రం నూతన గదులు ప్రారంభం

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

మండలంలోని శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వెలిసిన దిగువ అహోబిలంలోని శ్రీకృష్ణదేవరాయ కాపు, బలజ, తెలగ, ఒంటరి అన్న సత్రంలో సకల సౌకర్యాలతో నూతనంగా నిర్మించిన గదులను ఈ నెల 25న సత్రం అధ్యక్షులు శెట్టి విజయ కుమార్, గౌరవ సలహాదారుడు గోగిశెట్టి నరసింహారావు, ఉపాధ్యక్షులు గూడూరు సంజీవ రాయుడు తదితరుల ఆధ్వర్యంలో ప్రారంభించనున్నట్లు అన్న సత్రం కమిటీ సభ్యులు మంగళవారం తెలిపారు. ఈ ప్రారంభోత్సవానికి బలిజ, కాపు, తెలగ, ఒంటరి కుటుంబ సభ్యులు ప్రతి ఒక్కరు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. మధ్యాహ్నం భోజన కార్యక్రమం ఉంటుందన్నారు. సత్రం అధ్యక్షులు శెట్టి విజయ్ కుమార్, ఉపాధ్యక్షులు గూడూరు సంజీవ రాయుడు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు.

ఎంఆర్‌పి ధరలకే విక్రయించాలి : ఎస్‌ఐ

ప్రజాశక్తి - మహానంది

ప్రముఖ శైవ క్షేత్రం మహానందిలో వ్యాపారస్తులు కన్నడ భక్తులకు వస్తువులు ఎమ్మార్పీ ధరలకే విక్రయించాలని ఎస్సై నాగార్జున రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మహానంది పోలీస్ స్టేషన్లో చిరు వ్యాపారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఉగాది పండగ సందర్భంగా మహానంది క్షేత్రానికి వచ్చే భక్తులకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన ఎమ్మార్పీ ధరలకే విక్రయాలు జరపాలన్నారు. అధిక ధరలకి విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

బడ్జెట్‌పై అసెంబ్లీ సమావేశాలు జరపాలి : ఆవాజ్

ప్రజాశక్తి - నంద్యాల అర్బన్

బడ్జెట్‌పై అసెంబ్లీ సమావేశాలు జరపాలని ఆవాజ్ కమిటీ జిల్లా కార్యదర్శి మస్తాన్వలి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం 10 రోజులు బడ్జెట్ సమావేశాలు జరపాలని నిర్ణయం తీసుకొని గవర్నర్ ప్రసంగం అనంతరం బడ్జెటను ప్రవేశపెట్టిన ఆర్థిక మంత్రి అన్ని శాఖల మంత్రులతో, ప్రతిపక్ష పార్టీలతో శాసనమండలిలో చర్చ జరిపి ఆమోదం తీసుకోవాల్సి ఉందన్నారు. కానీ ఆ విధంగా జరపకుండా, ప్రజా సమస్యలు పరిష్కారం చేతగాని వైసిపి ప్రభుత్వం తమ తప్పులను కప్పిపుచ్చుకొనుటకు ఎదుటివారి తప్పులను వెతికి చర్చకు పెట్టి దాడులు చేయడం సరైంది కాదన్నారు. గతంలో దివంగత ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి కూడా ఈ విధంగానే చంద్రబాబుపై అనేక ఆరోపణలు చేసి కమిటీలు వేసి చివరికి తనకు తానే వాటన్నింటినీ విరమించుకున్నారని పేర్కొన్నారు.

యుటిఎఫ్ జిల్లా నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - నంద్యాల

నంద్యాలలోని నిశాంత్ భవన్‌లో జరిగిన యుటిఎఫ్ ప్రథమ కౌన్సిల్ సమావేశంలో జిల్లా నూతన కమిటీని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడుగా ఎస్.జాకీర్ హుస్సేన్, అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా పివి.ప్రసాద్, జె.సుధాకర్, సహాధ్యక్షులుగా కె.సత్య ప్రకాశం, ఎన్.శాంతిప్రియ, కోశాధికారిగా బాబా ఫకృద్దీన్, కార్యదర్శులుగా రాంమోహన్, పి.రామానంద కిషోర్, ఎస్.అమీర్ అహ్మద్, రామ కృష్ణుడు, షమీమ్ భాను, సంధ్యారాణి, జి.రామ్మూర్తి, పిసిహెచ్.బాల స్వామి, వెంకట ప్రభాకర్ రెడ్డి, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా జె.రఫీ అహ్మద్, సభ్యులుగా యు. దస్తగిరి, బి.వేంకటేశ్వర్లు, సాయిప్రసాద్, విజయ్ కుమార్‌లు ఎన్నికయ్యారు. రాష్ట్ర కౌన్సిలర్‌లుగా ఎం.ఐజయ్య, నాగ స్వామి నాయక్, ఎన్.శాంతి ప్రియలు ఎన్నికయ్యారు. అంతకుముందు జిల్లా అధ్యక్షుడు పివి ప్రసాద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో గత ఆరు నెలల కాలంలో జరిగిన కార్యక్రమాలను సమీక్షించుకొని, భవిష్యత్ కర్తవ్యాలను నిర్దేశించుకున్నారు. జిల్లాలో ప్రభుత్వ, మున్సిపల్, జిల్లా పరిషత్, మండల పరిషత్, ఐటిడిఎ, ఆశ్రమ, మోడల్ స్కూల్, కస్తూరిబా పాఠశాలల సమస్యలు, అందుకనుగుణంగా కార్యాచరణపై చర్చించారు.


ప్రమాణ స్వీకారం చేస్తున్న యుటిఎఫ్ జిల్లా నూతన కమిటీ

త్వరలో వంద పడకల వైద్యశాల ప్రారంభం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - బనగానపల్లె

త్వరలో బనగానపల్లెలోని 100 పడకల ఏరియా వైద్యశాలను ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు ఎమ్మెల్యే కాటసాని రామి రెడ్డి తెలిపారు. మంగళవారం పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న 100 పడకల ఏరియా ప్రభుత్వ వైద్యశాలను, డబల్ రోడ్డు పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. ప్రభుత్వ వైద్యశాల పనులను కాంట్రాక్టర్ మహేశ్వరరెడ్డి, వైద్యశాల సూపర్నెండెంట్ డాక్టర్ సుజాతలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రూ. 22 కోట్లతో 100 పడకల ఏరియా వైద్యశాల పనులు ముమ్మరంగా జరుగుతున్నట్లు తెలిపారు. రెండు నెలల్లో పనులు పూర్తవుతాయని చెప్పారు. త్వరలో అన్ని ఎక్విప్మెంట్స్ రానున్నట్లు తెలిపారు. వైద్యశాలలో 23 మంది డాక్టర్లకు గాను 15 మంది ఉన్నారని, 24 మంది స్టాఫ్ నర్స్‌కు 18 మంది ఉన్నారని, మరో 24 మంది స్టాఫ్ నర్సులు కావాలని, శానిటేషన్ సిబ్బంది ప్రస్తుతం 8 మంది ఉన్నారని, మరో 20 మంది కావాలని, సెక్యూరిటీ గార్డులు ఐదు మంది ఉన్నారని మరో 11 మంది కావాలని ఉన్నతాధికారులకు నివేదికలు పంపినట్లు తెలిపారు. నంద్యాలలో మెడికల్ కాలేజీ ఏర్పాటు చేస్తున్నారని, బనగానపల్లె ఏరియా వైద్యశాలను త్వరలో జిల్లా వైద్యశాలగా మార్చే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో వైసిపి అవుకు మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డి, డాక్టర్ శిరీష, పంచాయతీరాజ్ డిఇ నాగ శ్రీనివాసులు, ఎంపీడీవో శివరామయ్య, వైసిపి జిల్లా ప్రచార కార్యదర్శి సిద్ధం రెడ్డి రామ్మోహన్ రెడ్డి, యువజన విభాగం జిల్లా అధ్యక్షులు గుండం నాగేశ్వరరెడ్డి, నాయకులు డాక్టర్ మహమ్మద్ హుస్సేన్, అత్తార్ జాహిద్ హుస్సేన్, బండి బ్రహ్మానంద రెడ్డి, జిల్లెల్ల శంకర్ రెడ్డి, ఎర్రగుడి రామసుబ్బారెడ్డి, గౌండ కంబగిరి తదితరులు పాల్గొన్నారు.


వైద్యశాల పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

ప్రతి విద్యార్థి ఇష్టంతో చదవాలి

- శ్రీ రాజ రాజేశ్వరీ పాఠశాల కరస్పాండెంట్ ఎం.రామేశ్వరరావు

ప్రజాశక్తి - గడివేముల

ప్రతి విద్యార్థి ఇష్టంతో చదవాలని, అప్పుడే విజయాలు సొంతమవుతాయని శ్రీ రాజ రాజేశ్వరి ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ ఎం.రామేశ్వరరావు పేర్కొన్నారు. మంగళవారం శ్రీ రాజ రాజేశ్వరి ఉన్నత పాఠశాలలో ఫేర్వెల్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1985లో ఐదు మంది విద్యార్థులతో పాఠశాలను ప్రారంభించామని, నేడు దాదాపు 1600 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని తెలిపారు. ఈ పాఠశాలలో చదివిన విద్యార్థులు నేడు నలుగురు ఉపాధ్యాయ వృత్తిలో, ఒకరు వైద్యాధికారిగా విధులు నిర్వహిస్తున్నారని చెప్పారు. మరెంతో మంది విద్యార్థినీ విద్యార్థులు ఉన్నత స్థానంలో ఉన్నారని తెలిపారు. పదవ తరగతి విద్యార్థినీ విద్యార్థులు పబ్లిక్ పరీక్షలను మానసిక ప్రశాంతతతో ధైర్యంగా ఎదుర్కోవాలన్నారు. పాఠ్యాంశంలోని అన్ని సిలబస్‌లను చదివి పూర్తిగా అర్థం చేసుకొని పరీక్షల్లో మంచి ఫలితం సాధించాలన్నారు. పదో తరగతి విద్యార్థులకు ఈ సమయం ఎంతో కీలకమైంది అన్నారు. విద్యార్థులు స్మార్ట్ ఫోన్లకు, సినిమాలకు, క్రికెట్‌కు దూరంగా ఉండి చదువుపై శ్రద్ధ పెట్టి చదవాలన్నారు. విద్యార్థులు ముందుగా ఉపాధ్యాయులు బోధించే పాఠ్యాంశాలను అర్థం చేసుకోగలిగితే పరీక్షలు ఎదుర్కోవడం కష్టం కాదన్నారు. సమాజంలో ఉత్తమ పౌరులుగా విద్యార్థులను తీర్చిదిద్దడంలో తల్లిదండ్రుల కంటే అధిక ఉపాధ్యాయులే కీలకమన్నారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది రఘురాం శర్మ, కిట్టు, ప్రభుత్వ ఉపాధ్యాయులు. సుబ్బరాయుడు, అబ్దుల్ రవూఫ్, గఫూర్, చెన్నయ్య, విద్యార్థినీ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పాఠశాల కరస్పాండెంట్ ఎం.రామేశ్వరరావు

జిల్లా ప్రజలందరికీ ఉగాది శుభాకాంక్షలు

- జిల్లా మంత్రులు, కలెక్టర్, ప్రజాప్రతినిధులు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

శుభకృత్ నామ సంవత్సర ఉగాది పండగ సందర్భాన్ని పురస్కరించుకుని జిల్లా ప్రజలకు అన్ని శుభాలు కలగాలని జిల్లా ఇంచార్జి మంత్రి, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి.అంజాద్ బాషా, జిల్లా మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్, జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్, నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానంద రెడ్డి, ఎస్పీ కె.రఘువీర్ రెడ్డి, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, జెసి, నిశాంతి, డిఆర్‌ఒ పుల్లయ్య, ఇతర ప్రజాప్రతినిధులు సంయుక్తంగా మంగళవారం ఒక ప్రకటనలో ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలంతా ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని, అందరి భాగస్వామ్యంతో అభివృద్ధిలో జిల్లా ముందడుగు వేయాలని ఈ సందర్భంగా వారు అభిలషించారు.

గిరిజన పాఠశాలను ఎమ్మెల్యే తనిఖీ

ప్రజాశక్తి - పాణ్యం

పాణ్యం మండలం నెరవాడ గ్రామ సమీపాన వున్న గిరిజన గురుకుల పాఠశాలను ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి మంగళవారం తనిఖీ చేశారు. ఫుడ్ పాయిజన్‌తో విద్యార్థినులు అస్వస్థతకు గురయిన సంఘటన చోటు చేసుకున్న నేపథ్యంలో పాఠశాల వాతావరణం, డైనింగ్ హాల్, స్టోర్ రూమ్‌ను పరిశీలించారు. అనంతరం విద్యార్థినులతో ముఖాముఖి మాట్లాడారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇన్ని సంవత్సరాలుగా ఎన్నడూ పాఠశాలలో ఇలా జరగలేదని, పిల్లలు బయటి నుండి తెచ్చుకున్న చిరుతిండి, ఐరన్ టాబ్లెట్స్ వేసుకోవడం వల్ల ఇలా జరిగిందని అన్నారు. ఈ రోజు పిల్లలు అందరూ ఆరోగ్యంగా వున్నారని, ఇక నుండి పిల్లల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ప్రిన్సిపాల్‌కు, సిబ్బందికి సూచించారు. స్టోర్ రూం లో సరైన గాలి లేకపోవడం వల్ల కూరగాయలు త్వరగా కుల్లి పోయే అవకాశం వుందని, తగిన ఏర్పాట్లు చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు సూర్య నారాయణ రెడ్డి, కరుణాకర్ రెడ్డి, చందమామ బాబు, పాలెం చంద్ర శేఖర్ రెడ్డి, సర్పంచి, అధికారులు దస్తగిరి, తహశీల్దార్ మల్లికార్జున రెడ్డి, మండల విద్యాధికారి కోటయ్య, ప్రిన్సిపాల్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి

ప్రజాశక్తి
www.prajasakti.com



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

తాగునీటి సమస్య పరిష్కారానికి ముందస్తు చర్యలు చేపట్టాలి : సిపిఎం

ప్రజాశక్తి - ఆత్మకూరు

పట్టణంలో తాగునీటి సమస్య పరిష్కారానికి ముందస్తు చర్యలు చేపట్టాలని సిపిఎం పట్టణ కార్యదర్శి ఎ. రణధీర్, పట్టణ నాయకులు ఎస్ స్వాములు,ఏ సురేంద్ర, డి రామ్ నాయకులు పేర్కొన్నారు. సోమవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ 24 వార్డుల్లో 365 రోజులు నిరంతరాయంగా ప్రజలకు నీటి సరఫరా చేస్తామని చెప్పిన అధికారులు, ప్రజాప్రతినిధులు ముందస్తు చర్యలు చేపట్టకపోవడం వారి నిర్లక్ష్యానికి తాగునీటి సమస్య నిదర్శనమన్నారు. వేసవికాలం సమీపిస్తుండడంతో ఆత్మకూరు పట్టణం చుట్టూ నీరు ఉన్న పట్టణంలోని అన్ని కాలనీలకు మూడు రోజులు నాలుగు రోజులు ఐదు రోజులకు ఒకసారి నీరు వదలడం తో ప్రజలు పలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. చేతి పంపులు మరమ్మతులకు నోచుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి మంచినీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు వెంటనే చేపట్టాలని కోరారు. లేని పక్షంలో ప్రజలను సమీకరించి మున్సిపల్ కార్యాలయం ముందర పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామన్నారు.

చలో ఢిల్లీని జయప్రదం చేయాలి

- వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం నాగేశ్వరావు

ప్రజాశక్తి - ఆత్మకూరు

ప్రధాని నరేంద్ర మోడీ విధానాలకు వ్యతిరేకంగా ఏప్రిల్ 5న నిర్వహించే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం నాగేశ్వరావు అన్నారు. మంగళవారం నాడు ఈ కార్యక్రమానికి పి షకీర్ సాహెబ్ అధ్యక్షత నందికొట్కూరు కొత్త బస్టాండ్ నందు సిఐటియు, రైతు సంఘం, వ్యవసాయ ఆధ్వర్యంలో జీప్ జాతను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎం. నాగేశ్వరావు, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రతి సంవత్సరం రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని, రైతుల ఆదాయాలను రెట్టింపు చేస్తామని, 100 రోజుల్లో ధరలు అదుపు చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చి 9 సంవత్సరాలు కాలంలో ఇచ్చిన హామీలు అమలు చేయకపోగా పెట్రోలు ,డీజిల్ ,వంట గ్యాస్, విద్యుత్ చార్జీలు విపరీతంగా పెంచి ప్రజల పైన మోయలేని భారాలు మోపారని వారు ఆరోపించారు. మోడీ ప్రభుత్వం పెట్టుబడి దారులు కార్పొరేట్ శక్తుల ప్రయోజనాల కోసం పనిచేస్తోందన్నారు. ముడుపులు తీసుకొని ప్రతిపక్ష శాసనసభ్యులను కొనుగోలు చేసి మహారాష్ట్ర, కర్ణాటక, మధ్యప్రదేశ్, గోవా ,త్రిపుర తదిత రాష్ట్రాల్లో బిజెపి



మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం నాగేశ్వరావు

అధికారంలోకి రావడం జరిగిందని వారు ఆరోపించారు. ప్రజా సమస్యల పైన ఆందోళన చేస్తున్న ప్రతిపక్ష నాయకుల పైన దేశద్రోహం కేసులు పెట్టి జైల్లో పెట్టడం జరుగు తుందని అన్నారు. కేంద్ర బడ్జెట్లో 4 లేబర్ కోడ్లను రద్దు చేయాలని, తదితర సమస్యలపైన ఏప్రిల్ 5న ఢిల్లీలోని జం తర్ మంతర్ దగ్గర లక్షలాది మందితో ఆందోళన కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ కార్యక్ర మానికి ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం, సిఐటియు, వ్యకాస నాయకులు వేస్తరాజు, గోపాలకృష్ణ, మద్దిలేటి, మునిస్వామి, ఆకుల రాము, వెంకటేశ్వర్లు, శివుడు, నరసింహ, ఏసన్న, నాగన్న, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



పంటలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి

నష్టపోయిన రైతులను ఆదుకుంటాం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - గడివేముల

అకాల వర్షంతో నష్టపోయిన రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటామని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ అన్నారు. మండలంలోని మంచాలకట్ట గ్రామంలో మంగళవారం నాడు వడగండ్ల వానతో దెబ్బతిన్న పంటలను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి మాట్లాడుతూ అధికారులందరూ ప్రతి ఒక్క రైతుకు ఈ క్రాప్ నమోదుపై అవగాహన కల్పించి, పంటలను ఈ క్రాప్ నమోదు చేయించాలన్నారు. సిఎం దృష్టికి ఇనాం రైతుల సమస్యలను తీసుకెళ్లి పరిష్కరిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి ఆర్బి చంద్రశేఖర్ రెడ్డి, మండల అధ్యక్షురాలు నాగమద్దమ్మ, రైతు విభాగం జిల్లా అధ్యక్షులు శిరుప శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్ వెంకటేశ్వర్లు, అనిల్ కుమార్ రెడ్డి, మేఘనాథ్ రెడ్డి, తాసిల్దార్ శ్రీనివాసులు, వ్యవసాయ అధికారి హేమసుందర్ రెడ్డి పాల్గొన్నారు.



సిఎం చిత్ర పటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు, తదితరులు

బేతంచెర్లకు పాలిటెక్నిక్ కాలేజీ మంజూరు

ప్రజాశక్తి - బేతంచెర్ల

బేతంచెర్ల మండలానికి పాలిటెక్నిక్ కాలేజీని రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేయడం పట్ల ప్రజలు, వైసిపి నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి ఆధ్వర్యంలో కార్యకర్తలతో ప్రదర్శన నిర్వహిస్తూ టపాసులు పేలుస్తూ సంబరాలు జరుపుకున్నారు. అనంతరం స్థానిక పాత బస్టాండ్ నందు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చిత్రపటానికి వైయస్సార్ పార్టీ సీనియర్ నాయకులు బాబుల్ రెడ్డి ఆధ్వర్యంలో పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా బేతంచెర్ల మండలం ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ సిహెచ్ చలం రెడ్డి మాట్లాడుతూ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి చొరవతో రాయలసీమను ఎడ్యుకేషన్ హబ్‌గా మార్చడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి నాయకులు బాబుల్ రెడ్డి, గూని నాగరాజు ,కోడె వెంకటేశ్వర్లు, ఎద్దులన్న ,వెంకటేశ్వర్లు, రామనాయుడు, దస్తగిరి, తిరుమలేశ్వర్ రెడ్డి, భాస్కర్, నిరంజన్, కిరణ్, సురేష్, మహానంది, ప్రజలు పాల్గొన్నారు.

23న బండలాగుడు పోటీలు

ప్రజాశక్తి - బేతంచెర్ల

మండల పరిధిలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామంలో ఉగాది పండుగను పురస్కరించుకొని, సుంకులమ్మ పరమేశ్వరి తిరుణాల మహోత్సవము సందర్భంగా ఈనెల 23వ తేదీన మండల స్థాయిలో బండలాగుడు ఎద్దుల బల ప్రదర్శన పోటీలు నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్దలు మోహన్ రెడ్డి రాజు మంగళవారం తెలిపారు. మొదటి బహుమతి రూ.5000, రెండవ బహుమతి రూ.3000, మూడవ బహుమతి రూ.2000 లను అందజేస్తున్నట్లు వారు తెలిపారు.

పండగ పూటా పస్తులే..

- రెండు నెలలుగా అందని ఉపాధి వేతనాలు

- ఇబ్బందుల్లో కూలీలు

ప్రజాశక్తి - బనగానపల్లె

ఉపాధి కూలీలకు రెండు నెలల నుండి వేతనాలు రాకపోవడంతో పండగ పూట సరుకులు కొనడానికి డబ్బులు లేక కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బనగానపల్లె మండలంలో 2600 మంది కూలీలు ఉపాధి పనులకు వెళ్తున్నారు. వీరికి ఫిబ్రవరి నెల 6వ తేదీ నుండి నేటి వరకు వేత నాలు అందలేదు. దీంతో పూట గడవడం కష్టంగా మారింది. పండగ పూట వేతనాలు వస్తే కుటుంబ సభ్యులతో సంతోషంగా పండగ చేసుకుందామని ఆశపడ్డారు. అయితే ప్రభుత్వం వేతనాలు ఇవ్వకపోవడంతో తెలుగు సంవత్సరాది ఉగాది పండగ రోజు కొత్త బట్టలు కొనడానికి, సరుకులు కొనడానికి డబ్బులు లేక ఉపాధి కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పండగ సరుకుల కోసం అప్పులు దొరకక అల్లాడుతున్నారు. ముఖ్యంగా మండలంలోని పడమటి పల్లెల్లో పనులు లేకపోవడంతో కూలీలందరూ ఉపాధి



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

పనికి వెళ్లారు. గతంలో నెలరోజులకే వేతనాలు బ్యాంకు ఖాతాలో జమ చేసే వారు. ఈ సంవత్సరం రెండు నెలలు గడుస్తున్నా ఉపాధి కూలీల వేతనాలు జమ కాలేదు. రెక్కాడితే గాని డొక్కాడని పేద కూలీల అవస్థలు వర్ణనాతీతం. జనవరి నెలలో జరిగిన రెండు వారాల పనులకు మాత్రమే డబ్బులు వచ్చాయని, దాదాపుగా ఏడు వారాల నుంచి వేతనాలు రావడం లేదని కూలీలు చెబుతున్నారు. ఇలాగే ఆలస్యమైతే ఉపాధి పనులకు వెళ్లలేమని కూలీలు వాపోతున్నారు. అధికారులు స్పందించి వేతనాలు త్వరగా వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని ఉపాధి కూలీలు కోరుతున్నారు.

రెండు నెలల నుండి వేతనాలు రావడం లేదు

- ఉపాధి కూలీ వరలక్ష్మీ, పెద్దరాజుపాలెం గ్రామం



రెండు నెలల నుండి ఉపాధి కూలీ వేతనం రావడం లేదు. పండుగ పూట పస్తులు ఉండవలసిన పరిస్థితి నెలకొంది. ఉగాది పండుగకు కూలిలు ఇస్తారని ఎంతో ఆశపడ్డాం. కానీ కూలిలు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు స్పందించి కూలిలు త్వరగా వచ్చేలా చూడాలి.

రేషన్‌లో బియ్యంకు బదులు జొన్నలు

- ఇప్పటి వరకు 2,060 మెట్రిక్ టన్నుల జొన్నలు సేకరణ

- భూ తగదాల పరిష్కారానికే రీ సర్వే : జెసి



పజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

చిరుధాన్యాల ప్రాధాన్యత పెంపొందించేందుకు రేషన్ కార్డుదారులకు బియ్యంకు బదులు జొన్నలు పంపిణీ చేయనున్నట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిశాంతి తెలిపారు. మంగళవారం జెసి ఛాంబర్‌లో తనను కలిసిన విలేకర్లతో జెసి పలు విషయాలను వెల్లడించారు. పాత కాలంలో చిరు ధాన్యాలను ప్రజలు ఎక్కువగా వాడే వారన్నారు. ప్రస్తుతం వాటి వాడకం తగ్గిందన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో చిరు ధాన్యాల ప్రాధాన్యతను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం ఇంటర్నే షనల్ ఇయర్ అఫ్ మిల్లెట్ ప్రకటించిందన్నారు. చిరుధా న్యాల్లో ఫైబర్, మినరల్స్, విటమిన్ వంటి పోషకాలు ఉంటా యని, డయాబెటిస్ తగ్గడం కోసం చిరు ధాన్యాలు అవసరం అవుతాయానే ఉద్దేశ్యంతో బియ్యం బదులు జొన్నలు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. నంద్యాల జిల్లాలో ఎక్కువగా జొన్నలు పండిస్తారని, అందువలన జొన్నలు సివిల్ సప్లై ద్వారా కొనుగోళ్ల ప్రారంభించా మన్నారు. నేరుగా రైతుల వద్దకే వెళ్లి జొన్నలు కొనుగోలు చేస్తూ రెండు రోజుల్లోనే వారి ఖాతాల్లో సొమ్ము జమ చేస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఇప్పటివరకు 2,060 మెట్రిక్ టన్నులు జొన్నలు కొనుగోలు చేసినట్లు వెల్లడించారు. ప్రభుత్వం నుండి అనుమతి రాగానే లబ్ధిదారులకు వారి ఇష్ట పూర్వకంగానే జొన్నలు ఇస్తామన్నారు.

భూ తగాదాల పరిష్కారానికే రీ సర్వే

భూ తగాదాల పరిష్కారానికే జిల్లాలో భూ రీసర్వే పనులు చేపడుతున్నట్లు జెసి పేర్కొన్నారు. హద్దులు గుర్తించి భూ యజమానుల నుండి అభ్యంతరాలు లేకుంటే పక్కాగా సరి హద్దులు నిర్ణయించి, భూ హక్కు పత్రాన్ని ఫీల్డ్ మ్యాప్‌తో ఇస్తామన్నారు. ఆళ్లగడ్డ, చాగలమర్రి, రుద్రవరం మండలాల్లో మొత్తం 9 గ్రామాల్లో రీసర్వే జరుగుతుందని, మొదటి, రెండవ దఫా రీ సర్వేలో దాదాపు 13 గ్రామాలు పూర్తి చేశామన్నారు. చుక్కల భూములు రెగ్యులరైజేషన్ సంబంధించి 1954 ముందు అసైన్‌మెంట్ అయివుంటే వాటిని రెగ్యులరైజేషన్ చేయడానికి వీలుంటుందని తెలిపారు. ఆ తరువాతి వాటికి ఎపి డాట్ ల్యాండ్ 2017 యాక్ట్ ప్రకారం రెగ్యులర్ చేయడానికి అవకాశం లేదన్నారు. ఆర్ఎస్ఆర్‌లో పేర్లు ఎక్కకుండా డాట్ ల్యాండ్ అని ఉంటుందని, 12 సంవత్సరాలు అనుభవంలో ఉన్నట్లు డాక్యుమెంటు అందజేస్తే తహసీల్దార్, ఆర్డీఓల ద్వారా కలెక్టరేట్‌కు వస్తే డిఎల్ఎస్ ద్వారా అప్డేసైనా ఆర్ఎస్ఆర్ డాట్ ల్యాండ్‌ను రెగ్యులరైజేషన్ చేస్తామన్నారు.

వాయిదా పడిన వేలంపాటలు

ప్రజాశక్తి - చాగలమర్రి

చాగలమర్రి మేజర్ పంచాయతీ కార్యాలయ పరిధిలోని పలు వేలంపాటలు వాయిదా పడ్డాయి. చాగలమర్రి పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఈవో సుదర్శన రావు ఆధ్వర్యంలో మంగళవారం వేలం పాటలను ప్రారంభించారు. వేలంపాటా దారులు కొందరే పాల్గొన్నారు. పంచాయతీ పరిధిలో ఉన్న కోటగడ్డ వీధిలోని రెండు గదులు ఒకటి నెలకు రూ. 2600లు, రెండోది రూ.3600లకు వేలం పాట జరిగింది. మిగిలిన సంతమార్కెట్, దినబండ్ల మార్కెట్, కబేళా తదితర వేలంపాటలకు పాటాదారులు పెద్దగా ఆసక్తిగా ముందుకు రాకపోవడంతో వాయిదా పడ్డాయి. మరో తేదీని నిర్ణయించి, వాయిదా పడ్డ వాటికి తిరిగి వేలంపాటలు నిర్వస్తామని ఇఒ తెలియజేశారు.

పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి - చాగలమర్రి

స్థానిక శివాలయం కాలనీలోని టిడిపి నంద్యాల పార్లమెంట్ బీసీ సెల్ స్పోక్ పర్సన్, సమరసత సేవా ఫౌండేషన్ నంద్యాల జిల్లా సహా కన్వీనర్ సల్లా నాగరాజు యాదవ్ ఉగాది పండుగను పుష్కరంచుకొని పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులు పరిశుభ్రం చేయడం వల్లనే పట్టణ ప్రజలు రోగాల బారినపడకుండా ఉంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో గుత్తి నరసింహులు, చోటు, కాశినేని ఓబులేసు, నాగార్జున, బోడళ్ళ ఓబులేసు, బాలు, అబ్దుల్లా, నరేంద్ర, మోహన్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు రాగి జావ

(5వ పేజీ తరువాయి...) సీఐ సుబ్బరాయుడు, ఆర్అండ్‌బి డిఈ సునీల్ రెడ్డి, పాఠశాల హెచ్ఎం పద్మావతమ్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. **రుద్రవరం :** విద్యార్థుల ఆరోగ్యమే ప్రభుత్వ ధ్యేయమని ఆళ్లగడ్డ మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ గంధం రాఘవరెడ్డి తెలిపారు. స్థానిక కన్యకా పరమేశ్వరి ఉన్నత పాఠశాలలో విద్యార్థినీ విద్యార్థులకు రాగిజావ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. హెచ్ఎం శ్రీనివాసరెడ్డి, పాఠశాల కమిటీ చైర్మన్ లింగం బ్రహ్మయ్య, వైసీపీ నాయకుడు దేవగుడి నజీర్ హుస్సేన్, ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. **ఆళ్లగడ్డ** : విద్యార్థుల ఆరోగ్యమే వైసిపి ప్రభుత్వ ధ్యేయమని మున్సిపాలిటీ వైస్ చైర్మన్ నాయబ్ రసూల్ అన్నారు. పట్టణంలో జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో తహసీల్దారు హరినాథ్ రావు, ఉప తాసిల్దార్ రవీంద్ర ప్రసాద్, ఎంపీడీవో సుబ్బారెడ్డి, ఎంఈవో శోభ వివేకవతి రాగిజావ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కౌన్సిలర్ గోట్లూరు సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. **పాణ్యం :** పాణ్యం ఎంపిపి స్కూల్‌లో విద్యార్థులకు రాగి జావా పంపిణీ కార్యక్రమాన్ని ఎంపిపి హుస్సేన్ బీ, వైసిపి నాయకులు సద్దల సూర్యనారాయణ రెడ్డి, ఎంఈఓ కోటయ్యలు ప్రారంభించారు. సర్పంచ్ మేకల పల్లవి, వైస్ ఎంపీపీ పార్వతమ్మ, వైస్ సర్పంచ్ చంద్రా రెడ్డి, నాయకులు కరుణాకర్ రెడ్డి, చందమామ బాబు, మండల కో ఆప్షన్ మెంబర్ జాకీర్, ఎంపీటీసీ నారాయణమ్మ, హెచ్ఎం వెంకటేశ్వర్లు, స్కూల్ పిఎంసి చైర్మన్ రఫీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. **శిరివెళ్ల :** మండలంలోని మహాదేవపురం, పచ్చర్ల గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో రాగి జావా పంపిణీ కార్యక్రమాన్ని సర్పంచ్ పెద్ది రమణయ్య ప్రారంభించారు. కార్యక్రమంలో సర్వ లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయ మాజీ చైర్మన్ కొంటె జయ లక్ష్మమ్మ, వెంకట స్వామి, ఈశ్వరయ్య, మద్దిలేటి, బాషా తదితరులు పాల్గొన్నారు. **మహానంది :** మహానంది మండలం తమ్మడపల్లె గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు రాగి జావ పంపిణీ కార్యక్రమాన్ని ఎంపీపీ బుడ్డారెడ్డి యశస్విని ప్రారంభించారు. తహశీల్దార్ జనార్దన్ శెట్టి, ఎంపీడీవో శివ నాగజ్యోతి, జెడ్పిటిసి కెవిఆర్ మహేశ్వర్ రెడ్డి, విద్యాధికారి రామసుబ్బయ్య, డిప్యూటీ తాసిల్దార్ నారాయణరెడ్డిలు పాల్గొన్నారు. **డోన్ :** విద్యార్థులకు సంపూర్ణ ఆరోగ్యం కోసం ప్రభుత్వం రాగిజావాను ప్రతిరోజు ఉదయం పాఠశాలలో అందిస్తుందని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ పేర్కొన్నారు. డోన్ పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో, రైల్వే స్టేషన్ రోడ్‌లో ఉన్న హైస్కూల్లో రాగిజావాను విద్యార్థులకు అందించే కార్యక్రమంను మున్సిపల్ చైర్మన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఎస్ఎండి.జాకీర్ హుస్సేన్,ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

జడ్పి ఉన్నత పాఠశాల పాతపేట డోన్ నందు నిర్వహించిన రాగి జావ ప్రారంభోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, జెడ్పీటీసీ బద్దల రాజ్ కుమార్ హాజరై విద్యార్థులకు రాగి జావను అందించారు. అనంతరం వారు మాట్లాడారు. మండల అభివృద్ధి అధికారి శ్రీనివాసులు, ఎంఇఒ ప్రభాకర్, మున్సిపల్ వైస్ చైర్మన్ జాకీర్ హుస్సేన్, ప్రధానోపాధ్యాయులు పద్మావతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

- పౌష్టికాహారలోపాన్ని రక్తహీనతను తగ్గించుకోవడం కోసం గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలు చిరుధాన్యాలను ఎక్కువగా తీసుకోవాలని ఐసిడిఎస్ సిడిపిఓ షంషాద్ బేగం పేర్కొన్నారు. డోన్ పట్టణంలోని స్థానిక శ్రీరామ్ నగర్‌లో మూడవ అంగన్వాడి సెంటర్ నందు పౌష్టికాహారలోపం, రక్తహీనత కార్యక్రమంపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ సిడిపిఓ షంషాద్ బేగం మాట్లాడారు. చిరుధాన్యాలలో ఐరన్ శాతం ఎక్కు వగా ఉండడంతో రక్తహీనత రాకుండా ఉండడానికి తోడ్పాటు అంది స్తాయన్నారు. అంగన్వాడి కేంద్రంలో ఇచ్చే వైయస్సార్ సంపూర్ణ పోషణ కిట్టును కచ్చితంగా తినాలని సూచించారు. ఈనెల 20వ తేదీ నుంచి వచ్చే నెల మూడో తేదీ వరకు పోషణ మాసోత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడి సూపర్వైజర్స్, వైద్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. **బండి ఆత్మకూర్ :** రాగిజావ అందించడం ద్వారా విద్యార్థులకు క్యాల్షియం పుష్కలంగా అందుతుందని, రాగిజావ ద్వారా వేసవి తాపం తీరుతుందని సర్పంచ్ కాలూరి శ్వేతకుమారి, వైయస్సార్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు కాలూరి ప్రసాద్ పేర్కొన్నారు. ఎర్రగుంట్ల గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు రాగిజావ అందించే కార్యక్రమంలో వారు మాట్లాడారు. కార్యక్రమంలో హెచ్ఎం విశ్వనాథరెడ్డి, ఉపాధ్యాయులు భాస్కర్ రెడ్డి, నాగేశ్వరెడ్డి, బాలశివయ్య, నిర్మలమ్మ, ఇమ్రాన్, విజయ రాణి, రేఖ, తదితరులు పాల్గొన్నారు. **ప్యాపిలి:** విద్యార్థులకు రాగి జావా కార్యక్రమా న్ని జిల్లా ప్రజా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో జెడ్పీటీసీ బోరెడ్డి శ్రీరామరెడ్డి, ఎంఈఓ శ్రీనివాసులు ప్రారంభిం చారు. ప్రధానోపాధ్యాయు రాలు విజయ నిర్మల,ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **చాగలమర్రి:** పట్టణంలో జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఎంపీపీ రామిశెట్టి వీరభద్రుడు, తహసీల్దారు విజయ్ కుమార్, ఎంపీడీవో చంద్రశేఖర్, ఎంఈవో అనురాధ రాగిజావ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. మండల ఉపాధ్యక్షులు ముల్లా రఫి, ప్రధానోపాధ్యాయులు కోటయ్య, పాఠశాల యాజమాన్య కమిటీ అధ్యక్షులు అబ్దులా పాల్గొన్నారు. **పాములపాడు:** మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత ఉన్నత పాఠశాల్లో విద్యార్థులకు రాగిజావ కార్యక్రమాన్ని ఎంఈఓ బాలాజీ నాయక్ ప్రారంభించారు. భానుముక్కల గ్రామంలో సచివాలయం నందు చిరుధాన్యాలతో తయారుచేసిన వంట కాలను ప్రదర్శించారు. మహిళా పోలీస్ తస్లీమా, అంగన్వాడి టీచర్లు స్వాతి, మునెమ్మ, తదితరులు పాల్గొన్నారు. **ఆత్మకూరు:** ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలోనీ 21వ వార్డులో వెంగలరెడ్డి కాలనీ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు రాగిజావ పంపిణీని కౌన్సిలర్ బోయ లక్ష్మమ్మ ప్రారంభించారు. ప్రధానోపాధ్యాయుడు నాయక్, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు. **బేతంచెర్ల :** మండల పరిధిలోని గురుమానుకొండ సీతారామపురం ఆర్ఎస్ రంగాపురం అంబాపురం ఆయా గ్రామాలలో రాగిజావ కార్యక్రమము ప్రారంభించారు.



బనగానపల్లె : రాగిజావను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాటసాని



బండి ఆత్మకూర్ : రాగిజావ పోస్తున్న సర్పంచ్ శ్వేత కుమారి



రుద్రవరం :రాగి జావను పంపిణీ చేస్తున్న గంధంరాఘవరెడ్డి



శిరివెళ్ల : రాగి జావ పంపిణీ చేసిన సర్పంచ్ పెద్ది రమణయ్య



డోన్ : అవగాహన కల్పిస్తున్న ఐసిడిఎస్ సిడిపిఓ షంషాద్ బేగం



ఆళ్లగడ్డ : రాగిజావ పంపిణీ చేస్తున్న దృశ్యం

ఎవిఎస్ ఆదర్శాలు స్ఫూర్తి : యుటిఎఫ్

ప్రజాశక్తి - చాగలమర్రి

ఏవిఎస్ గారి ఆదర్శాలు ఉపాధ్యాయులకు స్ఫూర్తి అని యూటిఎఫ్ నాయకులు పేర్కొన్నారు. మంగళ వారం చాగలమర్రి పట్టణంలోని యూటిఎఫ్ కార్యాలయంలో మండల అధ్యక్షులు వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి డెన్నీజాన్సన్‌ల ఆధ్వర్యంలో అప్పారి వెంకటస్వామి (ఏవీఎస్) వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యుటిఎఫ్ ఆవిర్భావంలో కీలక పాత్ర పోషించి 27 సంవత్సరాల పాటు రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా యుటిఎఫ్



నివాళులు అర్పిస్తున్న యూటిఎఫ్ నాయకులు

సంఘ నిర్మాణములో అభ్యున్నతికి అప్పా రి కృషి అమోఘం అన్నారు. నిస్వార్థంగా జీవించడం ఏవీఎస్ స్ఫూర్తికి నిదర్శనం అన్నారు. ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకుంటూ ప్రైవేటీకరణ విద్యను, ప్రైవేటీకరణ విధానాలను తిప్పికొట్టాలని అన్నారు. ఈ కార్యక్రమం లో గౌరవాధ్యక్షుడు బెన్నయ్య, ఆర్థిక కార్యదర్శి యేసు దాస్, జిల్లా కౌన్సిలర్ శంకర్, గౌస్ ఉపాధ్యాయులు విజయరాజు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు : ఎంపిపి

ప్రజాశక్తి - బండి ఆత్మకూర్

మండలంలోని 20 గ్రామ పంచాయతీలు మూడో గిరిజన గూడెం లలో వేసవి కాలంలో తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు చేపట్టాలని మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు దేరెడ్డి చిన్న సంజీవరెడ్డి తెలిపారు. మంగళవారం మండల ప్రజా పరిషత్ సమావేశపు భవనంలో పంచాయతీ కార్యదర్శులు, ఆర్డబ్ల్యుఎస్ అధికారులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. మండలంలో ఏ గ్రామ పంచాయతీలో కూడా తాగునీటి సమస్య ఉన్నట్లు తమ దృష్టికి రాకుండా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. చేతిపంపులు, ఓవర్ హెడ్ ట్యాంకులు, డైరెక్ట్ పంపింగ్ మోటార్లకు ఎక్కడైనా సమస్యలు ఉంటే మరమ్మతులు చేయాలన్నారు. అధికారులు గ్రామ పంచాయతీలలో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆయన



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి డి చిన్న సంజీవరెడ్డి

కోరారు. గ్రామాల్లో పారిశుధ్య పనులు క్రమం తప్పకుండా చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ ఉమారాణి, ఎంపీడీవో వాసుదేవగుప్త, ఈఓఆర్‌డి శ్రీనివాసులు, పరిపాలన అధికారి అనీఫ్ ఖాన్, హౌసింగ్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేలపై దాడులు సిగ్గుచేటు : టిడిపి



డోన్ : మాట్లాడుతున్న రాష్ట్ర తెలుగుదేశంపార్టీ కార్యదర్శి వలసల రామకృష్ణ



ఆత్మకూరు : మాట్లాడుతున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి-డోన్

టిడిపి ఎమ్మెల్యేలపై వైసిపి ఎమ్మెల్యేలు దాడి చేయడం హేయమైన చర్య అని టిడిపి నాయకులు అన్నారు. డోన్ పట్టణంలో టిడిపి కార్యాలయం నందు డోన్ పట్టణ టిడిపి అధ్యక్షులు చాటకొండ శ్రీనివాసులు, డోన్ మండలం టిడిపి అధ్యక్షులు సలీంద్ర శ్రీనివాసులు యాదవ్‌ల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. రాష్ట్ర తెలుగుదేశంపార్టీ కార్యదర్శి వలసల రామకృష్ణ మాట్లాడుతూ టిడిప ఎమ్మెల్యేలు డోలా వీరాంజనేయస్వామి, బుచ్చయ్య చౌదరిల పట్ల వైసిపి ఎమ్మెల్యేలు ప్రవర్తిం చిన తీరును తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. సిఎం జగన్ మోహన్ రెడ్డి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ అధికార ప్రతినిధి గంధం శ్రీనివాసులు, నంద్యాల జిల్లా టిడిపి బిసి సెల్ అధ్యక్షులు ప్రజావైద్యశాల మల్లికార్జున,సింగిల్ విండో డైరెక్టర్ మధుసూదన్ రెడ్డి,తెలుగుయువత కమిటీ నాయకులు ప్రవీణ్ రెడ్డి,ఉడుములపాడు నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు. **ఆత్మకూరు :** అసెంబ్లీ సాక్షిగా టిడిపి ఎమ్మెల్యేలపై వైసీపీ ఎమ్మెల్యేలు దాడులు చేయడం సిగ్గుచేటని కొత్తపల్లి మండల టిడిపి నాయకులు కెవి శివారెడ్డి చిన్న పుల్లారెడ్డి నాగ శేషన్న అన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ అసెంబ్లీలో ప్రజల సమస్యల పరిష్కారం కోసం మాట్లాడకుండా టిడిపి ఎమ్మెల్యేలపై వైసీపీ ఎమ్మెల్యేలు దాడులు చేయడం సిగ్గుచేటైన విషయం అన్నారు. అధికార పార్టీ అసెంబ్లీని కేవలం టిడిపి ఎమ్మెల్యేలను నాయకులను తిట్టడం కోసమే ఏర్పాటు చేసుకుంది అన్నారు. నాయకులు నాయక్, శంకర్ ఉన్నారు.

- ఆత్మకూరు పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద తెలుగుదేశం పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీశైలం దేవస్థానం మాజీ చైర్మన్ వంగాల శివరామిరెడ్డి, టిడిపి నాయకులు జెట్టి వేణుగోపాల్, అబ్దుల్లాపురం బాష, శివప్రసాద్ రెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమం లో తెలుగుదేశం నాయకులు రామ్మూ ర్తి, షఫీ ఉల్లా, ఫక్రుద్దీన్, సతీష్, రమేష్ గౌడ్, సుబ్బ రాజు, తదితరులు పాల్గొన్నారు. **పాముల పాడు :** శాసనసభలో టిడిపి ఎమ్మెల్యేలపై దాడి హేయమైన చర్య అని మండల టిడిపి తెలుగు యువత అధ్యక్షులు మధు కృష్ణ అన్నారు. తెలుగుయువత జనరల సెక్రటరీ హాఫీజ్, ఉస్మాన్ బాషా, రామకృష్ణ, విరేశ్, అబ్దుల్ బషీర్, మదు, అబు, పాల్గొన్నారు.



పాములపాడు :మాట్లాడుతున్న నాయకులు